కథా నిలయం
1496
శ్రీకాకుళం

# బ్రతికిన దినాలు

అర్ధరాత్రి కావచ్చింది. ఎల్లెడలా ప్రశాంతంగా ఉన్నది. సాధారణంగా ఎప్పుడూ ఈ సమయంలో దూరంగా ఎక్కడో వినపడుతూ ఉండే కారు హారన్‌ల రొదకూడా వినపడడంలేదు. ట్రామ్‌కార్ల రాకపోకలు నిలచిపోయి చాలసేపు అయినది. బండ్ల చప్పుడు కాని, ఆఖరికి బీట్ కాన్‌స్టబుల్స్ బూటుకాళ్ళ ధ్వనికూడా వినరావడం లేదు. ఇంటిలోకూడా ఎక్కడా అలికిడి లేదు. భార్య లలిత పక్క మంచంమీద గాఢనిద్రలో మునిగి ఉన్నది. కొడుకు నాలుగేళ్ళవాడు సుందరం తల్లిని పొదివిపట్టుకుని నిద్రపోతున్నాడు. గదిలో మూల గోడనున్న బెడ్‌రూమ్‌లైట్ సన్నగా వెలుగుతున్నది. రోజు అంతా పనిచేసి ఉన్నాడేమో అలసటగా ఉన్నది. నిద్రకోసం అలమటిస్తున్న కళ్లు బరువుగా వేడిగా ఉన్నవి. అలసట మినహాగా శరీరంలో అస్వాస్థ్యమేమీ లేదు. చదువుకొని చదువుకొని ఇక కళ్ళు తెరచి ఉంచలేక, పుస్తకంలో అక్షరాలు అలుక్కుపోయి కనపడకపోవడంచేత దాన్ని మూసివేసి పడుకున్నాడు. అయినా సోమేశానికి నిద్రపట్టడంలేదు.

మనిషి అటూ ఇటూ దొర్లడంలేదు. చేయి మణచుకుని, తల దానిమీద పెట్టుకుని, వెల్లకిల పడుకుని ఇంటి పైకప్పువంక చూస్తూ నిశ్చలంగా ఉన్నాడు. సోమేశానికి నిద్రపోదామనే కోరిక బలంగా ఉన్నది. శరీరంలోని అణు

వణుకుతూ నిద్రకోసం ఆక్రోశిస్తున్నది. ధ్యానమంతా నిద్ర చుట్టూ పరిభ్రమిస్తున్నది. అయినా అతనికి నిద్ర పట్టడంలేదు.

మెదడుకు స్తబ్ధత్వం ఆవరించినది. ఎంతకూ నిద్రపట్టక పోవడంతో మెదడులో తిరిగి కొంత సంచలనం ఆరంభ మైనది. అది నిద్రపట్టక పోవడంచేత శరీరంచేసిన ఆక్రోశం లోంచి ఒకే ఒక్క ఎలుగు ఆ నీరవ నిస్తబ్ధ నిద్రాణ ప్రకృతిని చీల్చుకుంటూ నీరసంగా వినబడుతున్నది. సోమేశం ధ్యాన మంతా దానిమీాదనే ఉన్నది. ప్రతి రోజూ అదేసమయంలో ప్రక్క వాటాలోంచి వినపడే పసిబిడ్డ ఎలుగు ఆ రాత్రి విన పడటంలేదు. 'అందుచేతనే నిద్రపోలేకుండా ఉన్నానోయ్' అని అతని శరీరం ఆక్రోశిస్తున్నది. ఆ పసిబిడ్డ ఏడుప్వ ఈరాత్రి వినరావడంలేదు. ఆ ఏడుపు ఇక ఏరాత్రీ వినపడదు. అది వినపడే ఏడుపుకాదు. ప్రతి రాత్రీ ఆ సమయంలో ఏడ్చే ఆ పసిబిడ్డ గొంతుక శాశ్వతంగా మూసుకుపోయినది. ఆ బిడ్డ ఈరోజే మృతిచెందినది. ఆఏడుపు వినపడకపోవడమే సోమే శానికి నిద్రపట్టకపోవడానికి కారణమైనది. ఆ పసిబిడ్డ ఏడుపుకు అతనికి నిద్రపట్టకపోవడానికి సంబంధం ఉన్నది. సోమేశం ఆలోచనలు ఆ పసిబిడ్డమీాదికి మరలినవి.

ఏ వ్యక్తి అయినా గాఢంగా నిద్రపోయే సమయం అర్థరాత్రికి ముందుగానే అని చెప్పవచ్చు. ఆ తరువాత నిద్ర పోయినా ఒకటే, నిద్రపోకపోయినా ఒకటే. 'అది మానవుని అలసట అంత ఎక్కువగా తీర్చలేదు. అర్థరాత్రిలోగా గాఢంగా నిద్రపోయే సమయంలో ఏది నిద్రాభంగం కలిగించినా మనిషి సహించలేదు. రోజురోజంతా

కేవల శరీరకష్టం కాకుండా మానసికంగా కూడా శ్రమపడిన మానవుడు అసలే సహించలేడు. నిద్రాభంగమైనప్పుడు శరీరం అంతా నిద్రకోసం అలమటిస్తున్న సమయంలో నిద్ర పోవడానికి వీలులేని పరిస్థితి ఏర్పడినప్పుడు అతని మనసు కోపంతో దహించుకుపోతుంది. అది అంతకంతకు పాపం పెరిగినట్లు పెరిగి చివరికి ఆత్మశాంతిని, ఆత్మ స్థైర్యాన్ని నశింపచేస్తుంది. అట్టిది, ఈ రాత్రి నిద్రాభంగానికి కారణం కావలసిన ఆ పసిబిడ్డ ఏడుపు వినరానందుకు సంతోషించి హాయిగా గుండెమీద చేయివేసుకుని నిద్రపోవలసిన సోమేశం అది వినపడనందుకే నిద్రపోలేకపోతున్నాడు. దృష్టి అంతా దాని మీదనే కేంద్రీకరించి దానిని గురించే ఆలోచించడం ప్రారంభించాడు.

అసలా బిడ్డ అంతవరకు ప్రతిరాత్రీ తల్లి కడుపును అంటిపట్టుకుని ఆమె పక్కలో హాయిగా ఒదిగి నిద్రపోకుండా ఏడుస్తూ ఉండడానికి కారణం ఏమిటి? ఆ బిడ్డకు రుగ్మత కొంచెం మించుమించుగా ఇప్పటికి నాలుగు నెలలనుంచీ ఆ విధంగా ఏడుస్తూనే ఉన్నది. రాత్రులు ఏడవడంలో అబ్బుర మేమీ లేదు. అది సోమేశానికి వినపడడమే అబ్బురం. మద్రాసువంటి మహానగరంలో అందులోనూ జనసంకీర్ణం అత్యధికంగా ఉన్న తిరువళ్ళిక్కేణి హైరోడ్డులో ఏడు కుటుంబాలు కాపురమున్న ఇంటిలో నివసిస్తూ ఇంకా ఆ పసిబిడ్డ ఏడుపు సోమేశం వింటున్నాడంటే, అసలా ఏడుపు అతని చెవులలో దూరి అతని ఆలోచనలకు కేంద్రం కానడమే కాక అతని జీవితంలోనే ఒక భాగం అయినదంటే నిజంగా

ఆశ్చర్యకరమైన విషయమే. కొలదికాలం ఈ మహానగరం మధ్యలో నివశించేవారి చెవులు ధ్వనులను—అవి ఎంతటి భీషణ కఠోరధ్వను లయినా—వినగలిగే శక్తిని కోల్పోవడం తథ్యం. ఏడు కుటుంబాలవారు కాపురమున్న ఇంటిలో నివ సించేవారు క్రమంగా ఆ ఇంటిలో చప్పుళ్ళకు అలవాటుపడి పోతారు. అవి ఇక వారికి ఎట్టి బాధను కలిగించలేవు. వీటన్ని టిని మించిపోయే మహాధ్వని ఏమైనా ఉంటే తప్ప అవి వారి చెవులలో సొరలేదు. అటి స్థితిలో నిత్యమూ పక్కవాటా లోంచి వచ్చే పసిబిడ్డ రోదన ధ్వని సోమేశం ఇంకా వినగలుగు తున్నాడంటే దానికి కారణం ఉన్నది.

నగరాలలో- ముఖ్యంగా మద్రాసు మహానగరంలో- ఒకరితో ఒకరు కాకుండా నిర్బంధంగా ఒకరిమీద ఒకరు జీవి స్తున్న మానవులలో నశించిపోయిన మానవత్వం చేస్తున్న ఆక్రోశమా అనిపించే రోదన ఆ పసిబిడ్డ ఏడుపు. మద్రాసులో ఉంటూ మద్రాసు చేరుకున్న దాదిగా ఇక్కడి జీవిత పరిస్థితుల ప్రభావం ముఖ్యంగా ఇక్కడివారి మనస్తత్వం మూలంగా, తనలోని మానవత్వాన్నే కోల్పోయిన వ్యక్తి సోమేశం. అందుచేతనే ఆ పసిబిడ్డ ఏడుపు సోమేశం హృదయంలో ప్రతిధ్వనించినది. అతనిలో అణగారిపోయి ఉన్న మానవ త్వాన్ని తిరిగి రేకెత్తించి అతని హృదయాన్ని క్రూరంగా గాయపరచినది. ఈనాడు అతనికి శాశ్వతంగా వినపడకుండా పోయి అతని హృదయంలో ఆరని చిచ్చు రగుల్కొల్పినది.

* * *

సోమేశం ఇప్పటికి నాలుగు నెలలుగా ఆ పసిబిడ్డ రోదనధ్వని, ఆ అమాయక బాలిక బాధామయ వేదనారావం వింటున్నాడు. అతను ఈ ఇంట్లో ప్రవేశించి ఇప్పటికి ఏడాది పైన నాలుగు నెలలు అయినది. ఏడాది ఏవిధంగా గడిచి పోయిందో కాని ఈ నాలుగు నెలలనుంచి అత నా పసిబిడ్డ ఏడుపు వింటూనే ఉన్నాడు. ప్రాయశః ఈ ఇంట్లో ప్రవేశించి ఉండకపోతే ఆ ఏడుపు వినవలసిన అగత్యం ఉండకపోను. ఈనాడు ఆ బిడ్డ ఏడుపు శాశ్వతంగా నిలిచిపోవడం మూలంగా అతనికి నిద్రపట్టకపోవడంకూడా సంభవించి ఉండకపోవచ్చు.

అసలు సోమేశం ఆ ఇంట్లో ప్రవేశించడం మాత్రం ఎలా తటస్థించినది? రాఘవునితో కలసి ఒక ఇంటిలో ఉండటం అతనికి ఇక ఎంత మాత్రమూ ఇష్టంలేకపోయినది. వెంటనే అతన్ని విడిచి మరొక చోటుకి ఎక్కడికైనా వెళ్ళి పోవడానికి నిశ్చయించుకున్నాడు. ఆఫీసులో తనతోకూడా పనిచేస్తున్న తోడి గుమాస్తా వెంకటరావు తాను ఉంటున్న ఇంట్లో ఒక వాటా ఖాళీగా ఉన్నదని చెప్పాడు. అద్దె పది హేను రూపాయలు. అందుబాటులో ఉన్నది. ఆఫీసుకు చేరువ. ఇంట్లో అన్ని సౌకర్యాలూ ఉన్నవి. ఎక్కువమంది కుటుంబాలవారు ఆ ఇంట్లో నివసిస్తున్నారనేది తప్ప మరెట్టి ఇబ్బందులూలేవు. గాలి వెలుతురు చొరడానికికూడా వీలు లేదు. అయితే మద్రాసు మహానగరంలో గాలి వెలుతురు చొరడానికి వీలున్న ఇళ్ళు ఎన్ని? ఒకవేళ అట్టి సౌకర్యాలు ఉన్నా వాటిని అనుభవించడానికి తగిన అర్హత ఉన్నవారు

చాల తక్కువ. అందులోనూ సోమేశం మద్రాసుకు వచ్చిన నాటినుంచి ధారాళంగా గాలీ వెలుతురూ ప్రవేశించే ఇంట్లో ఎన్నడూ నివశించి ఉండలేదు.

ఇక ఎక్కువ కుటుంబాలు నివశించడమా! అదికూడా అలాంటి విషయమే. తెల్లవారి నిద్ర లేచినది మొదలు తిరిగి రాత్రి పది పదకొండు గంటలవేళ నిద్రపోయే నిమిషంవరకు అశేషమైన ప్రజలతో బుజాలు రాపాడించుకుని తిరుగుతూ, హోటళ్ళలో ఫలహారం చేయడం దగ్గరనుంచి బస్సులలోను, ట్రాములలోను చోటు సంపాదించుకునేవరకు, ఆఖరికి రోడ్డు ప్రక్క పేవ్‌మెంటులమీద నడవడానికి రవంత స్థలం సంపాదించుకోవడానికి కూడా వారితో కొట్లాడుతూ జీవించే ఈ నగరంలోని మనుష్యులు, కేవలం పదిమందిలో కలిసి ఒక ఇంట్లో నివసించి ఉండడానికి అలవాటు పడలేకపోతారా? సోమేశం బాగా అలవాటుపడే ఉన్నాడు. అందుచేత తోడి గుమాస్తా వెంకట్రావు సలహామీద ఈ ఇంట్లో వాటా అద్దెకు తీసుకుని దీనిలో ప్రవేశించాడు.

ఒకరకంగా ఆలోచిస్తే ఈ చిన్న సంఘటనలో విధి విధానమేదో ఉన్నట్లు తోస్తుంది. భగవంతునిమీద- విధి విధానం మీద విశ్వాసం కలిగిన మనిషి అయితే సోమేశం నిజంగా ఆ విధంగానే అనుకోని ఉండేవాడు. కాని నేటి కాలపు యువజనులు-అందులోను విద్యాధికులై స్వతంత్రంగా జీవించడం ప్రారంభించినవారు- క్రమంగా ఒక్కొక్కరే బాల భానుని లేత కిరణాల తాకిడికి పటాపంచలయ్యే ప్రాతఃకాలపు మంచులా కరిగిపోతూ ఉంటే భగవంతునిమీద, విధి విధానం

మీద ఆఖరికి జీవితం మీద కూడా విశ్వాసం కోల్పోయి హతాశులై జీవచ్ఛవాల్లా, యంత్రాల్లా బ్రతుకు సాగిస్తారు. సోమేశం కూడా అంతే. కాని ఆలోచించిన కొలది తాను ఈ ఇంట ప్రవేశించడం నిజంగా తన జీవితగమనానికి తగిన పరిణామమే అని తోచింది సోమేశానికి.

జీవితంలో ఏ సంఘటనకాని నిజంగా తతిమ్మా జీవితమంతటికీ సంబంధించినదిగా ఉండదు. జీవితంలోని తతిమ్మా సంఘటనలకు కూడా సంబంధించినదిగా ఉండదు. జీవితంలోని సంఘటనలన్నిటికీ వెనుక ఏదో ఒక భావం, ఒక పరమార్థం, ఒక ప్రయోజనం అనుస్యూతంగా వస్తూనే ఉంటుంది. అదే జీవిత మంతటినీ కలిపి, ఒకే రాగవరుసలోకి పాట అంతటినీ ఈడ్చే స్వరకల్పనలా, జీవితమంతటినీ బంధించే సూత్రంలా ఉంటుంది. ఏ సంఘటనకు ఆ సంఘటన అది జరిగే సమయంలో జీవితానికి భిన్నమైనదిగా కనుపించవచ్చు. అదే వాటన్నిటినీ దేనికది విశిష్టంగా ప్రత్యేకంగా స్మతిపథంలో నిలిచిపోయేటట్లు చేయడానికి పోటీపడుతుంది.

సోమేశం ఈ ఇంటిలో ప్రవేశించడం కూడా అదే విధంగా జరిగినది. దానిని గురించి ఆలోచిస్తూ ఉంటే సోమేశానికి మద్రాసులో తాను గడపిన జీవితం అంతా ఒక్కసారి స్మృతిపథంలో మెదిలినది. ఇది కథకాదు. కథలో కల్పన ఉండాలి. వైచిత్రి ఉండాలి. వైశిష్ట్యం ఉండాలి. రసం ఉండాలి. అన్నిటినీ మించి చెప్పే విధానం హృదయంగమంగా ఉండాలి. హృదయ విదారకమైన కథ అయితే కథకుడు హృదయం కదిల్చేటంతటి బలంగా కథను అల్లగలిగినప్పుడు

ఒక కన్నీటి బొట్టు రాల్చి, త్వరలోనే దానిని మరచిపోవ డానికి వీలు ఉన్నది. కాని ఇది కథకాదు. నిజంగా సోమేశం అనుభవించిన జీవిత చరిత్ర. అందువల్లనే ఒక కన్నీటిబొట్టు రాల్చి అంతటితో దానిని మరిచిపోగలిగిన సామర్థ్యము, అదృష్టం అతనికి లేవు.

౨

సోమేశం దాదాపు నాలుగేళ్ల క్రిందట మద్రాసుకు వచ్చాడు. అప్పటికి ఇంకా సుందరం జన్మించలేదు. సోమేశం ఆకస్మికంగా తన ఊరు విడిచిపెట్టవలసి వచ్చింది. అతను కట్టు బట్టలతో నెలలునిండిన ఇల్లాలిని వెంటబెట్టుకుని కడుపు చేతితో పట్టుకుని తండ్రి ఇల్లు విడిచి వెళ్ళిపోవలసిన అవసరం వచ్చింది, అవసరమేకాదు, ఆత్మగౌరవం కాపాడుకోవడానికి అలా వెళ్ళిపోవడం తప్పనిసరి అయినది. భార్యతో అత్తవారి ఊరు చేరుకున్నారు. అక్కడ కూడా అతను అట్టేకాలం ఉండలేదు. జీవనాధారం ఏమైనా కల్పించుకుని భార్యను, పుట్టబోయే సంతానాన్ని పోషించుకోవాలి. అత్తవారి ఊరు కూడా పల్లెటూరే. అక్కడ సోమేశంవంటి మనుష్యులు బ్రతకడానికి తగిన వసతులు ఏమీ లేవు.

సోమేశం జన్మస్థానం రామచంద్రపురం. బ్రాడీపేటలో స్వంత ఇల్లు ఉన్నది. తల్లి లేదు. తండ్రివద్ద రామచంద్రపురం లోనే ఉండి, అక్కడి హైస్కూలులోనే స్కూల్‌ఫైనల్ వరకు చదివాడు. పై చదువులు చదవడానికి తగినంత ఆ స్తి కాని, డబ్బుకాని లేదు. ఊళ్ళోనే షార్ట్‌హాండ్, టైప్‌రైటింగ్

అభ్యసించి, రెండింటిలోను లోయర్ గ్రేడ్ పరీక్షలో ఉత్తీర్ణుడైనాడు. స్కూల్ ఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణుడైన పిదప కొలది కాలంలోనే అతనికి వివాహం అయినది. టైప్ రైటింగ్ షార్టుహాండ్ చదువుతున్న కాలంలోనే తండ్రి సిఫారసుమీద ఒక బట్టలదుకాణంలో నెలకు పదిహేడు రూపాయల జీతం మీద గుమాస్తాగా చేరాడు. ఆ తరవాత మరికొంత కాలానికి భార్య కాపురానికి వచ్చింది.

తండ్రికి సోమేశంమీద కోపం అంత కంతకు అధికం కాసాగింది. సవతి తల్లికి మొదటే అతనిమీద ఇష్టంలేదు. ఒకానొక విషాదకరమైన సంఘటన జరగడంతో సోమేశానికి ఇక తండ్రి యింటిలో స్థానంలేకుండాపోయినది. అత్తవారి ఊరు కపిలేశ్వరపురంవద్దనున్న అంగర. భార్యను అక్కడ విడిచిపెట్టి, పెండ్లినాడు అత్తవారిచ్చిన వుంగరం తాకట్టు పెట్టగా వచ్చిన పాతిక రూపాయలు చేతబట్టుకుని, రెండు జతల బట్టలు, సర్టిఫికెట్లు సంచిలో పెట్టుకుని మద్రాసుకు బయలుదేరాడు. ఇది మద్రాసుకు రాకముందు సంగ్రహంగా సోమేశం చరిత్ర. ఇంతకుమించి చెప్పడం అనవసరం. (అదంతా మరొక కథ అవుతుంది) అవసరమైన విషయం ఒక్కటే. మద్రాసు చేరుకునేసరికి అతనివద్ద నాలుగు అయిదు రూపాయలకన్న ఎక్కువలేవు.

అయితే అతనికి ఒక ధైర్యం ఉన్నది. ప్రస్తుత సమయంలో అతనికి ఉన్న ఆస్తి అది ఒక్కటే. లోగడ కొంత కాలం తనతో కలసి షార్ట్‌హాండ్ టైప్ రైటింగు అభ్యసించిన సహాధ్యాయుడు మిత్రుడు శేషగిరిరావు ప్రస్తుతం మద్రాసులో

చంద్రా ఇన్స్యూరెన్సు కంపెనీలో స్టెనోటైపిస్టుగా పనిచేస్తు న్నాడు. శేషగిరిరావు వెనుక ఒకసారి తనకు ఉత్తరం వ్రాస్తూ మద్రాసు వచ్చినట్లయితే ఏదో ఒక ఉద్యోగం లభిస్తుందని అందులోనూ స్టెనోటైపిస్టుగా పనిచేయాడానికి అర్హత కలిగిన వారు ఉద్యోగాలు దొరక్క బాధపడవలసిన అగత్య మేమీ లేదనీ, మద్రాసులో స్టెనోటైపిస్టులకు ఏనాడూ అవసరం ఉంటూనే ఉంటుందనీ, మద్రాసు వచ్చినట్లయితే ఏమైనా ఉద్యోగం దొరికేవరకు తనతో కలిసి ఉండవచ్చుననీ తెలియ పరచాడు. శేషగిరిరావు ఉత్తరం వ్రాసి అప్పుడే రెండేళ్ళు గడిచింది. సోమేశం అతనితో ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం కూడా విరమించుకున్నాడు. అయినా అతనిమీద, అతని స్నేహంమీద సోమేశానకి నమ్మకం ఉన్నది.

సోమేశం వస్తున్నట్లు శేషగిరిరావుకు తెలియపరచలేదు. అతను ఇచ్చిన అడ్రసు పట్టుకుని కష్టపడి వెదుక్కుంటూ ఇల్లు చేరుకున్నాడు. శేషగిరిరావు ఈ అభ్యాగతుని ఆకస్మిక ఆగమనానికి చింతించలేదు. మీదు మిక్కిలి సంతోషించాడు.

శేషగిరిరావు జార్జిటౌన్ బాలూపిళ్ళే వీధిలో పన్నెండు కుటుంబాలవారు కాపురమున్న ఒక చిన్న ఇంటిలో ఉంటు న్నాడు. అతని క్రింద ఉన్నవి కేవలం రెండు గదులు. రెండూ ఒకదానితో ఒకటి కలిసిఉన్నవి. లోపలిగది వంటకు, ముందు గది శయనించడానికి ఉపయోగిస్తున్నారు శేషగిరిరావు, అతని భార్య సుశీల. లోపలిగదిలోకి ముందు గదిలోంచి వెళ్ళ వలసినదేకాని, మరొక ద్వార మేమీలేదు. ఆ వాటాదాటి ముందుకు అడుగుపెట్టితే సడప. అది ఇంటిలోవున్న అన్ని

కుటుంబాలవారి వుమ్మడి ఆస్తి. అదేవిధంగా ఇంటిలోవున్న ఏకైక పాయిఖానా, స్నానాల గది, కుళాయికూడా వుమ్మడి ఆస్తే.

నడవలో శయనించడానికి వీలులేదు. అందుచేత సోమేశం వచ్చినప్పటినుంచి సోమేశం, శేషగిరిరావు ముందు గదిలోను, సుశీల లోపలిగదిలోను శయనించడం ప్రారంభించారు. గదులుకూడా చాల ఇరుకైనవి. మొదటనే ఇరకాటంగా వున్న శేషగిరిరావు కుటుంబానికి సోమేశం రాకతో మరింత ఇబ్బంది కలిగింది.

శేషగిరిరావుడు దారుడు. సోమేశంతో స్నేహం కొలది పాటిదే అయినా ఎప్పుడో ఒకసారి కలసి చదువుకున్నామనే అభిమానం కొలది అతని క్షేమం మనసులో పెట్టుకుని మద్రాసులో వుద్యోగాలు దొరుకుతాయని వుత్తరం వ్రాశాడు. ఈనాడుకూడా అదే అభిమానంకొలదీ అతన్ని తన ఇంటిలో పెట్టుకున్నాడు. ఒకరికి సహాయం కావాలనే సంగతి తెలిసి అది చేయగలిగిన శక్తి తనకు వున్నట్లయితే చేయాలనే తహతహ పడే స్వభావం శేషగిరిరావుది. ఇతరులు కోరనే అక్కరలేదు. తనంతట తాను కలుగజేసుకుని ఆ సహాయం చేస్తాడు శేషగిరిరావు. అందులో అతనికి ఆనందం వున్నదనికాని, అది చేయడంలో పడే కష్టాలవల్ల ఆ తరువాత ఎప్పుడైనా దుఃఖిస్తాడని కాని ఎవరూ చెప్పలేరు. అతనికి కేవలం ఒక్క కోరికమాత్రం ఉన్నది. తాను ఆ సహాయం చేసినట్లు ఇతరులు గుర్తిస్తే చాలు. అతనికి మరి దేనితోనూ నిమిత్తం లేదు.

ఇప్పుడు సోమేశానికి ఉద్యోగం సంపాయించిపెట్టే భారం అంతా తన నెత్తిమీద పెట్టుకున్నాడు శేషగిరిరావు. దానితోపాటు అతని పోషణభారం కూడా సంతోషంగా వహించాడు. సుశీలా నిజంగా సుశీలే. సౌశీల్యంతోపాటు మంచితనం ఉన్న ఇల్లాలు. స్వపరభేదం గుర్తించదు. లేక పోతే వివాహమై భర్తతో కాపురంచేయటం ప్రారంభించి దరిదాపుగా ఐదేళ్ళు గడుస్తున్నా శేషగిరిరావు పరోపకార కార్యక్రమం ఇంతవరకు నిర్విఘ్నంగా కొనసాగవచ్చి ఉండేదికాదు.

ఉద్యోగం కోసం ప్రయత్నాలు ముమ్మరంగానే సాగుతున్నవి. ఉత్తరం వ్రాసినప్పుడు ముఖ్యంగా అందు కోసం ప్రయత్నించని కాలంలోను స్టెనో టైపిస్టులకు అవకాశాలు చాలా ఉన్నట్లు శేషగిరిరావుకు తోచినది. కాని తీరా రంగంలో ప్రవేశించి అందుకోసం ప్రయత్నం ప్రారంభించేసరికి నిజంగా అన్ని అవకాశాలు లేవనిస్పష్టమైనది. ఈ రంగంలోనూ పోటీఎక్కువే. ఎంతమందిఎరుగున్న వారితో చెప్పి, సర్టిఫికేట్లతో సోమేశాన్ని ఎన్నిసంస్థలకు పంపించినా అతనికి ఉద్యోగంసంపాదించి పెట్టలేకపోయాడు. ప్రతిరోజూ విధిగా హిందూ దిన పత్రిక కొని 'వాన్టెడ్ కాలమ్' తిరగేయడం ఆ ఇరువురికి పరిపాటి అయినది. పోస్టేజికి కూడా చాలా ఖర్చు చేశారు. నాలుగయిదు ఇంటర్వ్యూలకు వెళ్ళివచ్చాడు సోమేశం.

సోమేశం వచ్చి పదిహేను రోజులు దాటినది. ఇక్కడికి వచ్చినప్పుడే అతనివద్ద మిగిలి ఉన్న డబ్బు చాల తక్కువ. అది కాస్తా అప్పుడే అయిపోయినది. శేషగిరిరావే సోమేశం అడగకుండా డబ్బు ఇచ్చి అతన్ని ఊళ్ళో త్రిప్పుతున్నాడు. పదిహేను రోజులు గడిచేసరికల్లా ఇక సోమేశానికి ఉద్యోగం దొరకదేమో అనే అధైర్యంకూడా పట్టుకున్నది. శేషగిరిరావుకు ప్రయత్నించడానికి కొత్తమార్గాలు ఏమీ గోచరించడం లేదు.

ఒకనాడు సాయంకాలం శేషగిరిరావు ఆఫీసునుంచి ఇంటికి తిరిగి వస్తూవుంటే పూర్వం అతనితో కలసి అదే ఇన్స్యూరెన్సు కంపెనీలో కొంతకాలం పనిచేసి ప్రస్తుతం మౌంట్‌రోడ్‌లో ఒక బ్యాంకులో గుమాస్తాగా ఉన్న మిత్రుడు ఒకాయన తారసిల్లాడు. కబుర్ల సందడిలో శేషగిరిరావు సోమేశం ఉద్యోగం సంగతి అతనితో చెప్పాడు. ఇప్పుడు శేషగిరిరావు కంటికి కనపడ్డ మానవమాత్రులందరితోనూ సోమేశం సంగతి చెప్పి ఏమైనా ఉద్యోగం ఉంటే చూచిపెట్టండని బ్రతిమాలడమే పనిగా పెట్టుకున్నాడు. అందువల్ల దానిలో వింత ఏమీ లేదు. ఆశ్చర్యమల్లా అనుకోకుండా ఈసారి అది ఫలించడమే. "అయ్యో! ఈ సంగతి ముందే నాతో చెప్పలేకపోయావా? మౌంట్‌రోడ్‌లో గోపాలం అండ్ సన్స్ అనే ఒక వ్యాపారసంస్థ ఉన్నది. పదిహేనురోజుల క్రితమే ఆ కంపెనీలో స్టెనోటైపిస్టు ఉద్యోగం ఖాళీ అయినది. 'తెలిసిన మనిషి, బాగా పనిచేయగలిగిన మనిషి ఎవరైనా ఉంటే చూచిపెట్టండి, ఉద్యోగమిస్తాను' అని ఆ కంపెనీ మేనేజరు

నాతో అన్నాడు. అది ఇంకా ఖాళీగానే ఉన్నది. ఆయనతో చెప్పి ఆ ఉద్యోగం మీవాడికి లభించేటట్లు చేయగలను. రేపు సాయంత్రం నాలుగు గంటలవేళ నా దగ్గిరికి పంపు. ఈలోగా ఆయనతో కూడా టెలిఫోన్‌లో మాట్లాడి వుంచుతాను. తప్పకుండా అవుతుందిలే. ఆ కంపెనీకి మా బ్యాంకులో అక్కౌంటు ఉన్నది. ఆ సంబంధంలో ఒకసారి నేను ఆ కంపెనీ మేనేజరుకు ఒకచిన్న ఉపకారం చేయడం జరిగినది. లేకపోతే ఈ ఊళ్ళో మనమాట వినేవాడు ఎవడు?" అన్నాడు మిత్రుడు.

మిత్రునికి తన తరఫున, సోమేశం తరఫున కూడా కృతజ్ఞత తెలియపరచాడు శేషగిరిరావు. ఇన్నాళ్ళకు అయినా అదృష్టవశాత్తూ ఈ అవకాశం లభించినందుకు అతను సంతోషంతో పొంగిపోయాడు. నిర్వ్యాజమైన ప్రేమలో, దయలో అంతటి మహత్తరమైన ఆనందం ఉన్నది. ఇంటికి పోగానే సంగతి అంతా సోమేశంతో చెప్పాడు. అతనుకూడా సహజంగానే సంతోషించాడు. మరునాడు మధ్యాహ్నం మూడు గంటలకు సుశీల సంతోషంతో ఆప్యాయంగా చేసిపెట్టిన ఫలహారం తిని మౌంట్‌రోడ్ చేరుకున్నాడు సోమేశం. శేషగిరిరావు మిత్రుడు పనిచేస్తున్న కమర్షియల్ బ్యాంకుకు వెళ్ళాడు. ఆయన ఎంతో ఆదరించి, కాఫీ తెప్పించి ఇచ్చాడు. తనకు పరిచితుడైన కంపెనీ మేనేజరుకు ఉత్తరం వ్రాసిఇచ్చి, అడ్రసు చెప్పి సోమేశాన్ని పంపాడు. సోమేశం అక్కడికి వెళ్ళి తనపేరు ఒక కాగితం ముక్కమీద వ్రాసి లోపలికి పంపించాడు. ఆ మేనేజరు వెంటనే లోపలికి రమ్మని కబురుపంపాడు.

సోమేశం మేనేజరు గదిలో ప్రవేశించి వందనంచేసి, శేషగిరి రావు మిత్రుడు ఇచ్చిన ఉత్తరం ఆయనకు అందజేశాడు. ఆయన ఆ ఉత్తరం అందుకుని ఇంకా విప్పి చదవకుండానే

"మా కంపెనీలో పనిచేయడానికి మీకు ఎంతజీతం కావాలి?" అని అడిగాడు.

సోమేశం కొంచెం తబ్బిబ్బుపడినా "మీ ఇష్టంవచ్చినంత ఇవ్వండి!" అని సమాధానం చెప్పాడు.

"ఇంతకుముందు పనిచేస్తున్న స్టెనోకు ఎనభై రూపాయలు ఇస్తున్నాము. మీకుకూడా అంతే ఇస్తాము. ఇష్టమైతే వెంటనే, రేపే చేరవచ్చు" అన్నాడు మేనేజరు.

"సంతోషం- అయితే చేరతానండి-రెండు రోజులు టైమివ్వండి. వచ్చే సోమవారం ప్రవేశిస్తాను. మరి నా క్వాలిఫికేషను..." అంటూ సోమేశం చెప్పుతూ ఉంటే మేనేజరు అడ్డువచ్చాడు.

"అవన్నీ మీ మిత్రు లేనాడో చెప్పారు. మీరు షార్ట్‌హాండ్, టైప్‌రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్ష ప్యాసయ్యారు కదా-అది మాకు చాలు. అలాగే మీరు సోమవారం చేరవచ్చు. ఫార్మల్‌గా ఒక దరఖాస్తువ్రాసి ఇవ్వండి. అప్పాయింటుమెంటు ఆర్డరు మీకు పంపుతాను" అన్నాడు మేనేజరు.

ఎందుకైనా మంచిదని ముందుగా వ్రాసి తెచ్చిన దరఖాస్తు అందించాడు సోమేశం. ఆయన అప్పాయింటుమెంట్ ఆర్డరు పంపుతానని మళ్ళీ చెప్పి సోమేశంతో ఇంక వెళ్ళ

వచ్చునని అన్నాడు. సోమేశం ఆయనకు తన కృతజ్ఞత తెలియపరిచి, వందనం చేసి ఆయనవద్ద సెలవుతీసుకున్నాడు.

వడ్డించేవాడు మనవాడు అయినప్పుడు ఆఖరి పంక్తిలో కూర్చున్నా పరవాలేదని లోకోక్తి. స్నేహమో, పరిచయమో, మరేమైనా ఇతర సంబంధమో ఏదో ఒకటి లేకపోతే ప్రపంచంలో మనకి ఏ పనీ కాదు. అలాంటివి ఏమైనా ఉన్నప్పుడు ఏమాత్రమూ శ్రమపడకుండానే మన పనులు నిరాటంకంగా జరిగిపోతాయి. సోమేశం విషయంలో అంతే అయినది. శక్తి సామర్థ్యాలతో ప్రపంచంలో ఎవరికీ నిమిత్తం లేదు. కావలసినప్పుడు అవి లేకపోయినా ఇబ్బంది లేదు. అక్కరలేనప్పుడు అవి ఉన్నా ప్రయోజనంలేదు.

మరునాటికల్లా గోపాలం అండ్ సన్సు మేనేజరువద్ద నుంచి అపాయింట్‌మెంటు ఆర్డరు వచ్చింది. శేషగిరిరావు దంపతులు సోమేశానికి విందు చేశారు. అనుకున్న రోజున సోమేశం ఉద్యోగంలో చేరాడు.

మరొక వారం రోజులు గడిచేసరికి సోమేశానికి మగ పిల్లవాడు పుట్టినట్లు సోమేశం మామగారు ఉత్తరం వ్రాశారు. సోమేశానికి శేషగిరిరావు ఇంట్లో మరొక విందు.

అంతవరకు సోమేశం తన భవిష్యత్తు గురించేకాదు, వర్తమానం గురించికూడా అట్టే తీవ్రంగా ఆలోచించి ఉండలేదు. అతని జీవితం ఆకస్మికంగా తారుమారు అయినది. తల్లి పోయిననాటినుంచి తల్లి తండ్రికూడా అయిన తండ్రితో సంబంధం తెగతెంపులు చేసుకుని ఉన్న ఊరునుంచి లేచి

పోవలసివచ్చినది. పురుడు రానున్న భార్యను అత్తవారి ఇంటి వద్ద దిగవిడిచి బికారిలా మద్రాసుకు రావలసివచ్చినది. ఆ స్థితిలో అతని మనసు సంపూర్ణంగా వికలమైనది. ఉద్యోగం సంపాదించుకోవాలనే కోరికతప్ప అతని మనసులో మరే ఆలోచనకాని లేకుండాపోయినది.

ఉద్యోగం దొరికినది. ఆ కంపెనీలో ప్రవేశించి పని చేయడం ప్రారంభించాడు. రేపటిరోజున ఉద్యోగం దొరక్క-పోతే జీవితం ఏమౌతుందో అనే ఆవేదన నశించినది. వేళకు ఇంత తిని ఆఫీసుకుపోయి అలసి ఇంటికి వచ్చి మూసినకన్ను తెరువకుండా నిశ్చింతగా నిద్రపోతున్నాడు. ఈవిధంగా నాలు గయిదు రోజులు గడిచేసరికి అతనికి మానసికంగా స్వాస్థ్యం లభించినది. స్థిరభావంతో ప్రపంచాన్ని చూడ గలుగుతున్నాడు. ఆలోచన సాఫీగా సాగుతున్నది. అంతటితో సోమేశానికి జీవితం గురించిన జిజ్ఞాస ప్రారంభమైనది. భార్యను, పిల్లవాడిని చూడడానికి ముఖ్యంగా బారసాల చేసుకొనడానికి ఒకసారి అత్తవారి ఇంటికి వెళ్ళిరావాలి. ఆ తరువాత పది పదిహేను రూపాయల అద్దె మించకుండా ఏదైనా ఒక చిన్న వాటా తీసుకోవాలి. ఆఫీసుకు దగ్గరగా ఉంటే మంచిది. దారి ఖర్చులకు డబ్బు తగలబెట్టవలసిన అవసరం లేకుండా ఆఫీసునుంచి ఇంటికి, ఇంటివద్దనుంచి ఆఫీసుకు కాలినడకనే పోవచ్చు. లేకపోతే ఆ కంపెనీవారు ఇచ్చే జీతం తనకు ఒక్కడికి సరిపోదు. అదృష్టవశాత్తు సోమేశం అప్పులతో మద్రాసులో జీవితం ప్రారంభించలేదు. అప్పులతో జీవితం ప్రారంభించే నిర్భా

గ్యాలు చివరికి ఏనాటికైనా ఆ అప్పులతోనే జీవితం అంతం చేసుకోనవలసివస్తుంది.

ఆలోచనకు అనుగుణంగానే సోమేశం ఇంటికోసం అన్వేషణ సాగించాడు. క్రమంగా తన హద్దులకు మించకుండా అందుబాటులో ఉండే ఇల్లు దొరుకుతుందనే ఆశ అతనికి లేకుండా పోయినది. ఇల్లు సంపాదించడానికి ఒకే ఒక ప్రతిబంధకం ఉన్నది. వాటా చిన్నది కావచ్చు, పెద్దది కావచ్చు. అధమం ఆరు, నాలుగు నెలల అద్దె అయినా అడ్వాన్సుగా ఇవ్వనిదే ఇల్లు దొరకడం అసంభవం. ఆఫీసులో కొత్తగా అయిన మిత్రులతోను, పరిచయం అయిన వారితోను ఎంతమందితో చెప్పినా అందరూ ఒకటే మాట. అవసరమైతే ఎలాగో ఒకలా కష్టపడి ఉద్యోగమైనా సంపాదించి పెట్టగలంగాని ఇల్లుమాత్రం మా తరంగాదనే అందరూ అంటున్నారు.

సోమేశానికి రెండు మార్గాలు గోచరించినవి. మొదటిది ఏ పుణ్యాత్ములనైనా ప్రార్థించి అడ్వాన్సు చెల్లించడానికి సరిపోయేటంత డబ్బు అప్పు సంపాదించి ఇల్లు తీసుకోనడము. లేదా కొంతకాలంపాటు ఒంటరిగా ఉంటూ అదృష్టము, కాలము కూడివచ్చి ఎప్పుడు ఎక్కడ ఒక వాటా దొరికితే అప్పుడు దాన్ని తీసుకుని భార్యా బిడ్డలను తెచ్చుకుని కాపురం పెట్టడము. బారసాల చేసుకుని రావడంకోసం అత్తవారి ఇంటికి వెళ్ళినప్పుడు మామగారితో అడ్వాన్సు విషయం ప్రస్తావించాడు సోమేశం. ఆయన ప్రస్తుతం చాల చిక్కులలో ఉన్నట్లు, కుమార్తె పురిటికే బోలెడు ఖర్చు

అయినట్లు— దానిమూలంగా అప్పు అయిందని అన్నాడు. సహాయం చేయలేని పరిస్థితి కనుక అల్లునికి ఇల్లు దొరికేవరకు కుమార్తెను, మనుమని తన దగ్గర ఉంచుకోవటమే అల్లునికి తాను చేయగలిగిన మహోపకారమని కూడా ఆ మామగారు సూచించాడు. దానితో సోమేశానికి మొదటి మార్గం కట్టుబడిపోయినది. ఏమంటే తండ్రి తనకు సహాయం చేయడు. మామగారు చేయలేడు. ఇక అంతటి సహాయం చేయగలిగినవారు ఎవరూ లేరు. శేషగిరిరావు చేయగలిగిన సహాయమంతా చేస్తూనే ఉన్నాడు. అంతకుమించి సహాయం చేయగలిగిన శక్తి శేషగిరిరావుకు లేదు.

ఇక రెండవ మార్గమే సోమేశానికి మిగిలినది. దానికి కూడా పెద్ద చిక్కు ఒకటి వచ్చిపడినది. శేషగిరిరావు ఇంట్లో ఇంక ఉండడం భావ్యంకాదు. పైపెచ్చు అన్యాయం కూడా అవుతుంది. భార్యాభర్తలకు అడ్డుగా అక్కడ ఎంతకాలమని ఉండగలడు? ఉండక చేయగలిగేది మాత్రం ఏముంది? విడి గదులకు కూడా పదిహేను, ఇరవై, ఇరవై అయిదు రూపాయలవరకు పెట్టవలసి వస్తుంది. వాటికికూడా అధమం ఏ రెండు నెలలు అయినా అడ్వాన్సు ఇవ్వక తప్పదు. ఆమాత్రం యోగ్యత ఉన్నట్లయితే భార్యాబిడ్డలనే తీసుకొని రావచ్చు. అందుచేత మరొకరి ఇంటిలో ఎక్కడ అయినా ఉండడానికి ఏర్పాటుచేసికొని, హోటల్లో భోజనం చేస్తూ నాలుగు రాళ్లు వెనక వేసుకుని కాపురం పెట్టుకునే ఏర్పాటు చేసుకోవాలి. ఈ విధంగా సోమేశం ఆలోచించడానికి మరొక కారణం కూడా తోడు అయినది. బారసాల చేసుకొనడానికి ఇంటికి

వెళ్ళినప్పుడు అతనికి ఒక సంగతి తెలిసినది. సోమేశానికి వేలు విడిచిన మేనత్త ఒకామె ఉన్నది. ఆమె భర్త ఏదో వ్యాపారంచేస్తూ మద్రాసులోనేఉన్నాడు. వారి నివాసం ఎగ్మూర్ లో. వారు మంచి స్థితిపరులు. స్వంత ఇల్లు కాకపోయినా కొంచెం పెద్ద ఇంట్లోనే ఉంటున్నారు. ఒక వాటా ఇస్తారేమో అడగవచ్చు. వాటా ఇవ్వకపోయినా కొన్నాళ్ళపాటు తమ ఇంట్లో ఉండడానికి చోటు ఇవ్వవచ్చు అని భార్య లలిత చెప్పినది. ఆ ఆలోచన సోమేశానికి కూడా బాగానే ఉన్నట్లు తోచినది. ఆవిధంగానే చేద్దా మనుకొన్నాడు.

ఈ సంగతి శేషగిరితో చెప్పాడు. దానికి శేషగిరిరావు ఇచ్చిన సమాధానం ఇది —

"చూడరా సోమూ! బంధువుల ఇళ్ళల్లో ఉండడంఎంత బాధాకరమో నాకు తెలుసు. నాజీవితంలో అలాంటి అనుభవాలు చాలానే ఉన్నాయి. ఇలాంటివి చివరికి నీకు, ఇతరులకు కూడా భాధాకరంగానే పరిణమిస్తాయి. అయినా నీకు ఇలాంటి ఆలోచన ఎందుకు? మీ ఆవిడను పిల్లవాణ్ణి తీసుకువచ్చి కాపురం పెట్టుకునేవరకు నాతోపాటే ఉండు. నువ్వు ఇక్కడ ఉండడానికి అభ్యంతరమేమీ లేదుకదా? అంతేకాని, నువ్వు బంధువుల ఇళ్ళల్లో ఉండడం మాత్రం నాకు ఇష్టంలేదు. ఆ తరువాత నీ ఇష్టం" సుశీల కూడా భర్త మాటలనే బలపరచింది.

శేషగిరిరావు అన్న మాటల్లో సత్యం లేకపోలేదు. అయినా అతని ఇంట్లోనే ఉండిపోవడం సోమేశానికి ఇష్టం లేకపోయింది. తాను అక్కడ ఆ భార్యాభర్తలకు ఇరువురికీ

మధ్య ఉన్నాననే బాధ ఒకటి, తన పోషణ భారమంతా శేషగిరిరావే వహిస్తూ ఉండడం మరొకటి. గృహ నిర్వహణకు తనను ఎలాంటి ఖర్చు పెట్టనివ్వడు శేషగిరిరావు. ఈ పరిస్థితి శేషగిరిరావు ఇంట్లో తాను ఉన్నంతకాలమూ ఇలాగే ఉంటుందని సోమేశానికి అనిపించింది. అందుచేత ఆ మేనత్తగారి ఇంటికిపోయి అక్కడి సంగతి సందర్భాలు తెలుసుకుని ఆ తరువాత ఏదోవిధంగా చేద్దామనుకున్నాడు సోమేశం.

## 3

ఎగ్మూర్‌లో గంగురెడ్డి వీధిలో ఉన్న మేనత్తగారి ఇల్లు తెలుసుకుని అక్కడికి వెళ్లాడు సోమేశం. సోమేశం వెళ్ళినది సాయంకాలం. సమయానికి మేనత్త శేషమ్మగారు, ఆమె భర్త సుబ్బరామయ్యగారుకూడా ఇంట్లోనే ఉన్నారు. సోమేశానికి మేనత్తతో అట్టే అంత అనుబంధం లేదుకాని, పరిచయం మాత్రం ఉన్నది. సోమేశం చిన్నతనంలో శేషమ్మగారు తరుచుగా రామచంద్రపురం వస్తూనే వుండేవారు. సోమేశం తల్లి పోయింతర్వాత సోమేశం తండ్రి బంధువులందరితోనూ సంబంధం కొంచెమించుగా తెగతెంపులు చేసివేసుకున్నాడు. శేషమ్మగారి రాకపోకలు కూడా అంతటితో నిలిచిపోయినవి.

సోమేశాన్ని శేషమ్మగారు వెంటనే గుర్తు పట్టినది. భర్తతో చెప్పింది. వెనుకటి సంగతులన్నీ ఒకసారి తలచుకున్నది. సోమేశం తల్లి పోయినందుకు మరొకసారి విచారించింది.

కుశలప్రశ్నాదికాలు అయిన తరువాత సోమేశం మేనత్తని అడిగి ఆమె కుటుంబపు స్థితిగతులు గురించి తెలుసుకున్నాడు. శేషమ్మగారికి భర్త స్వగ్రామమైన కాకినాడలో ఒక ఇల్లు, అక్కడికి దగ్గరగానే ఉన్న రామేశ్వరంలో ఇరవై ఎకరాల సుక్షేత్రమైన మాగాణిభూమి, మరొక ఇల్లు, మద్రాసులో నేతి వ్యాపారము ఉన్నవి. నేతి వ్యాపారం చేసే సుబ్బరామయ్యగారు ఈ ఆస్తి అంతా ఆర్జించారు. రామేశ్వరంలో ఇల్లుమాత్రం పితృపితామహార్జితమైన ఆస్తి. శేషయ్యగారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. కుమార్తెకు వివాహమై మద్రాసులోనే కాపురం చేసుకుంటున్నది. ఆమె నివాసం పాత మాంబళంలో. కుమారుడు కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో ఎల్. ఎల్. బి. చదువుతున్నాడు.

మేనత్త శేషమ్మగారుకాని, ఆమె భర్త సుబ్బయ్యగారుకాని సోమేశం మద్రాసుకు వచ్చిన పని ఏమిటనికాని, ఎక్కడున్నావనికాని, ఏం చేస్తున్నావనికాని అడగలేదు. ఏమడిగితే ఏది ఎక్కడ తమ నెత్తిమీద పడిపోతుందోనని వారి భయం. శేషమ్మగారు మేనల్లునికి గొంతుక తడుపుకుందుకు పచ్చి మంచినీళ్ళుమాత్రం ఇచ్చింది. రాత్రి భోజనానికి ఉండవచ్చుననే సూచనకూడా గోచరించలేదు.

కాని సోమేశమే కావాలని తన భోగట్టా అంతా మేనత్తకు తెలియపరిచాడు. దాపరికం ఎందుకని తండ్రితో సంబంధం తెగతెంపులు చేసుకుని వచ్చిన సంగతికూడా చెప్పాడు. దానికి వారు సోమేశాన్ని ఖండించనూలేదు. హర్షించనూలేదు. ముభావంగా ఊరక ఉండిపోయారు.

ఇక సోమేశం తిరిగి వెళ్ళిపోవలసిన సమయం ఆసన్న మైనది. మేనత్త హాలులోనే కూర్చోబెట్టి ఇంతసేపూ కబుర్లు చెప్పింది. ఆఖరికి ఇల్లుఅయినా ఒకసారి చూద్దువుగాని రమ్మన మనికూడా అనలేదు. అయినా ఇల్లుచూస్తే విశాలంగానే ఉన్నట్లు కనుపిస్తూన్నది. మేనత్తగారి బంధుప్రేమ చూస్తే వాటా ఇమ్మని అడగడంవల్ల ప్రయోజనమేమీ ఉండదను కున్నాడు సోమేశం. అందుచేత కేవలం తను కొంతకాలం ఉండడానికి ఇంతచోటు ఇమ్మని అడిగి చూడడంవల్ల నష్ట మేమీ ఉండదని మనసులో వ్యాఖ్యానించుకున్నాడు. అయితే ఆ సంగతి మేనత్తవద్ద కదపడం మంచిది కాదనుకున్నాడు సోమేశం. ఒకవేళ మేనత్త తను ఉండడానికి ఇష్టపడినా ఆమె భర్తకు ఇష్టంలేకపోవచ్చు. భార్య చెబితే ఆయన కాదనలేక పోవచ్చు. ఆనాడు తను ఇక్కడ ఉండడం తనకే ఎబ్బెట్టుగా ఉంటుంది. అలాకాక సుబ్బరామయ్యగారివద్ద కదపడంవల్ల రెండు ప్రయోజనాలు ఉంటాయి. ఆయన తనకుకూడా ఇష్టంగాఉంటేనే ఆ సంగతి భార్యతో చెప్పి అందుకు అనుమ తించవచ్చు. తనకు ఇష్టంలేకపోయినా భార్య సమ్మతించక పోయినా ఆయనకు ప్రత్యేకంగా సోమేశంమీద కోపంరావ డానికి అవకాశం ఉండదు. మీదుమిక్కిలి ఆయన పరాయి వాడు కావడంచేత కాదనడానికి మొగంచెల్లక సమ్మతించినా సమ్మతించవచ్చు. ఎటూ దానివల్ల నష్టంమాత్రం ఉండదు.

తీరా వెళ్ళిపోతూ తనను సాగనంపడానికి రోడ్డువరకూ వచ్చి సుబ్బరామయ్యగారితో ఈ సంగతి గురించి మాట్లా డాడు సోమేశం.

"ప్రస్తుతం మద్రాసులో ఇళ్ళు దొరకడం చాల కష్టంగా ఉన్నది. ఆ సంగతి మీకుకూడా తెలిసే ఉంటుంది. ఎక్కడైనా ఒకవాటా సంపాదించి కుటుంబాన్ని తెచ్చుకుందామంటే అడ్వాన్సులు ఇవ్వడానికి నాకు శక్తిలేదు. అందుచేత మీ ఇంట్లో ఉండడానికి అనుమతించండి. భోజనం మాత్రం హోటల్‌లోనే చేస్తాను. కొలది కాలంలోనే ఎక్కడైనా ఇల్లు చూచుకుని కాపురం పెట్టుకుంటాను" అన్నాడు సోమేశం.

సుబ్బరామయ్యగారుకూడా దాపరికమేమీ లేకుండా అదే స్పష్టంగా చెప్పారు. ఉండడానికి అభ్యంతరం లేదుకాని, ఇంట్లో చోటులేదని. ఆయన అన్నదిది- "నువ్వు చెప్పినది బాగానే ఉంది. పూర్వకాలమైతే నువ్వు ఇలా అడగవలసిన అవసరం ఉండేదా? ఉండడానికి చోటు ఇవ్వడమేమిటి, నువ్వు మా ఇంట్లో మా పిల్లలతోపాటు ఉండి ఇక్కడే భోజనం చేయవలసినవాడవు కాదా? ఇంట్లో నాలుగే గదులున్నాయి. ఒకటి ఎప్పుడూ మావాడికిందే ఉంటుంది. ఊళ్లో లేనప్పుడు తాళంవేసుకుని వెళ్లుతాడు. ఒక గది మా అమ్మాయికింద ఉన్నది. అమ్మాయి అల్లుడు ఎప్పుడు వచ్చినా వారి గది వారికి ఉండకపోతే ఎలాగ చెప్పు? ఇకపోతే మిగిలిన రెండు గదుల్లోనూ ఒకటి నేను ఉపయోగిస్తున్నాను. ఒకటి కొట్టు గది. ఇంక ఈ హాలు, వంటగది, స్నానాలగది తప్పించి ఇంట్లో మరేమీ చోటులేదు. హాల్లో ఎలా వుంటావు చెప్పు? మాకు మా పిల్లలు ఒకటి, నువ్వు ఒకటి కాదు. పరాయివాడిలా హాల్లోవుంటే మాకు మాత్రం ఏమి బాగుంటుంది?

నువ్వు మరెక్కడైనా చూసుకో- ఇలా అన్నానని ఏమీ అనుకోకు. తరచు వచ్చి మీ మేనత్తను చూచిపోతూ వుండు నాయనా! మిమ్మల్ని చూస్తే దానికి ప్రాణం లేచివచ్చినట్లు ఉంటుంది."

సుబ్బరామయ్యగారివద్ద సెలవు తీసుకుని ఇంటికి వెళ్ళిపోయాడు సోమేశం. జరిగినదంతా కాకపోయినా సారాంశం మాత్రం శేషగిరిరావుతో చెప్పాడు. అతను చాలా నొచ్చుకున్నాడు. "ఈ బంధువుల దయా ధర్మభిక్షంతో మీకేమి నిమిత్తం? వేరే కాపురం పెట్టుకునేవరకు ఇక్కడే ఉండండి" అన్నది సుశీల. సోమేశంకూడా ఆ ఆలోచనకు మనసులో స్వస్తి చెప్పుకున్నాడు.

ఇది జరిగిన వారం పదిరోజులకు సోమేశం ఉబుసుపోక మళ్ళీ ఒకనాటి సాయంకాలం మేనత్త శేషమ్మగారి ఇంటికి వెళ్లాడు. సుబ్బరామయ్యగారు ఇంటిలో లేరు. శేషమ్మగారు ఏ కళను ఉన్నదో ఏమిటో ఇంట్లోకి తీసుకొనివెళ్ళి వంట ఇంటి గుమ్మందగ్గిర పీటవేసి కూర్చోబెట్టింది. వెంటనే వేడి వేడి కాఫీపెట్టి ఇచ్చింది. యోగక్షేమాలు అడిగి తెలుసుకుంది. ప్రయోజకుడై మద్రాసులో ఉద్యోగం సంపాదించి నాలుగురాళ్ళు సంపాదించుకుంటున్నందుకు మెచ్చుకున్నది. ఆ తరువాత ఇలా చెప్పింది:

"మొన్న మీ మామయ్యతో ఇక్కడ ఉంటానన్నావుట. పోనీ, ఆవేళ నాతో చెప్పలేకపోయావురా! నేనేం కాదంటానా, కూడదంటానా? నువ్వు నాకేమైనా పరాయివాడవా? స్వయంగా నా పినతండ్రి కొడుకు కొడుకువు.

అలాగే, ఇక్కడే ఉండు. కొట్టుగది ఖాళీచేయించి ఇస్తాను. నీ సామాను తెచ్చుకుని దానిలో పెట్టుకో. హోటల్లోనే భోజనం చేస్తున్నావుట. పోనీ అలాగే చెయ్యి. నీకుకూడా మీ నాన్నలాగే అభిజాత్యం తక్కువ. మీ నాన్న అంతే. బలవంతపెట్టినా పట్టుమని ఎవరిఇంట్లో అయినా ఒకపూట భోజనం చేయడానికి ఒప్పుకునేవాడుకాడు. నువ్వు మాత్రం ఆ తండ్రి కొడుకువు కాదేమిటి? నువ్వు- అన్నట్లు ఈ ఊళ్ళో ఇళ్ళ పరిస్థితి నిజంగా ఘోరకలిలాగే ఉంది. త్వరలోనే ఎక్కడైనా ఒక వాటా చూసిపెట్టమని మీ మామయ్యతో కూడా చెబుతాను. మీ కాపురంకూడా చూచి సంతోషిస్తాను. అంతవరకు ఇక్కడే ఉండు."

మేనత్తగారి మాటలు సోమేశానికి ఆశ్చర్యం కలిగించినవి. భోజనం పెట్టవలసిన ఇబ్బందిలేదు. ఉండేది కొలది కాలమే- అలాంటప్పుడు కాస్త చోటు ఎందుకు ఇవ్వకూడదు? ఉండడానికి కూడా చోటు ఇచ్చిందికాదని ఎవరైనా ఆడిపోసుకోవచ్చు. కొన్నాళ్ళపాటు ఉండనిస్తే ఆ ఉపకారంచేసిన పేరు అయినా ఉంటుందని ఆలోచించి మేనత్తే ఈ విధంగా నిశ్చయించి ఉంటుందని సోమేశం అనుకున్నాడు. ఏమైనా, శేషగిరిరావుకు కొంత ఏమిటి? బోలెడు ఇబ్బంది తొలగించినట్లు అవుతుంది, అనుకుని సంతోషించాడు అతను.- ఆ ఉద్దేశంతోనే మేనత్త చెప్పినదానిని అంగీకరిం

చాడు. మరుసటి సెలవురోజు ఆదివారంనాడు వస్తానని చెప్పి, జార్జిటౌనుకు తిరిగి వెళ్ళాడు.

తన ఇంట్లోంచి వెళ్ళిపోయి బంధువుల ఇంట్లో ఉండడానికే సోమేశం నిశ్చయించిన సంగతి తెలుసుకోగానే శేషగిరిరావుకు కొంత కోపం వచ్చింది. బంధువుల ఇళ్ళల్లో ఉండడం మంచిదికాదంటూ అతని శ్రేయస్సు ఆలోచించి తాను చెప్పిన మాటను అతను పాటించకపోవడంకూడా బాధ కలిగించినది. మొదటిసారి వారి ఇంటికి వెళ్ళినప్పుడు ఆ విధంగా పరాభవం జరిగినా సోమేశం మళ్ళీ అక్కడికి ఎలా వెళ్ళగలిగాడో శేషగిరిరావుకు అర్థంకాలేదు. అంతే కాని, కేవలం తనకు బాధలేకుండా చేయడమే సోమేశం లక్ష్యమున్న సంగతి అతనికి అంతుపట్టలేదు. అందుచేత అతను చేతులు కడుగుకుని ఇక సోమేశం గొడవ పట్టించుకోదలచకుండా క్లుప్తంగా ఉండిపోయాడు. సహజంగానే ఇది సోమేశానికి బాధకలిగించినది. అయినా అతను తన మనసులోని ఉద్దేశాన్ని శేషగిరిరావుతో చెప్పలేదు. సుశీల ఈ ఇరువురు మిత్రులకు మధ్య వచ్చిన కలతను చూస్తూ ఏమీ చేయలేక విచారంతో ఊరక ఉండిపోయినది.

ఆదివారం వచ్చింది. సోమేశం జార్జిటౌనునుంచి ఎగ్మూర్‌కు మకాం మార్చి వేశాడు. మేనత్త ఇంట్లో నివాసము, హోటల్లో భోజనము, సత్రం భోజనము, మఠం నిద్ర అన్నట్లుగా ఉంది అతని వ్యవహారం. నాటినుంచి సోమేశానికి, శేషగిరిరావుకు మధ్య సమాధ్య లేకుండా పోయింది.

## ౪

ఎనిమిది నెలలకాలం ఇట్టే గడచిపోయినది. ఈలోగా చాల సంఘటనలే జరిగినవి.

మేనత్తగారి ఇంటిలో అద్దె ఖర్చు లేకుండా ఉండి, భోజనానికి కాఫీ ఫలహారాలకు అతిముఖ్యమైన ఇతర అవసరాలకు మాత్రమే ఖర్చుచేస్తూ కొంచెం కొంచెం వెనక వేస్తూవచ్చి, ఏదైనా ఒక వాటా తీసుకొనడానికి తగినంత సొమ్ము నిలువజేసి, కుటుంబం తెచ్చుకుని కాపురం పెట్టుకోవాలని సోమేశం కోరిక. అది కోరికగానే నిలచిపోయినది. ఒకరివద్ద చేబదులు తీసుకొనవలసిన అవసరంలేకుండా ఎనభై రూపాయల జీతంమీద మద్రాసులో బ్రతకడమే గొప్ప విషయమని సోమేశం అనుభవం మీద తెలుసుకున్నాడు. అద్దె ఖర్చులంటే లేకపోయిందికాని, లేక లేక జన్మించిన కుమారునికి పాలడబ్బాలకు అయ్యేఖర్చుకు అయినా భార్యకు నెల నెలా కొంత డబ్బు పంపించక తప్పనిసరి కావడంతో ఆ వార కాస్తా పూర్తి అయినది. హోటల్లో భోజనం, హోటల్లోనే కాఫీ ఫలహారాలు, దారిఖర్చుకు కూడా డబ్బు తగల బెట్టవలసిన అవసరం లేదు. నెల ఆఖరికి సోమేశంవద్ద ఎర్రని ఏగానీ మిగలడంలేదు సరికదా, ఏ తోడి గుమాస్తావద్దనో పది పరక అప్పుతీసుకొనకుండా అతనికి నెల గడవడంలేదు. ఈ విధంగా జీవిస్తూవస్తే ఇక ఎంతకాలానికి అడ్వాన్సులు చెల్లించి ఇల్లు తీసుకొనగలిగిన యోగ్యత కలుగుతుందో—లేక అసలంటూ అట్టి యోగ్యత కలుగనేకలుగదో సోమేశానికి

అర్థంకావడంలేదు. అట్టి సౌభాగ్యం పట్టుతుందనే ఆశకూడా క్రమంగా అతనిలో అంతరించసాగినది.

శేషగిరిరావుతో సయోధ్య చెడడం మరొకటి. శేషగిరిరావు ఇంటిలోఉండి అసలే ఇరకాటంగాఉన్న ఆ ఇంట్లో శేషగిరిరావు దంపతులకు మరింత ఇబ్బంది కలుగజేయడం సోమేశానికి ఇష్టంలేకపోయింది. పైగా శేషగిరిరావుకు జీతం తక్కువే అయినా తను అతని ఇంట్లో ఉన్నంత కాలమూ తన పోషణభారం అతనే వహిస్తాడుకాని గృహనిర్వాహణకు ఏమాత్రమూ తోడుపడనివ్వడు. డబ్బు తీసుకోనడు, అవసరమైతే మరి ఎక్కడైనా అప్పుచేయడానికి సహితం వెనుతీయడు. కాని తనను మాత్రం అడగడు. తనుకూడా సంపాదించు కుంటున్నప్పుడు తన పోషణభారం అతని నెత్తిమీద పెట్టి అతన్ని చిక్కులలో పెట్టడం కూడా సోమేశానికి ఇష్టంలేకపోయినది. అందుచేతనే శేషగిరిరావు వద్దని చెప్పినప్పటికీ, తన మేనత్త కుటుంబానికి- తను వారి ఇంట్లో ఉండడం ఇష్టంలేదనేది మొదటనే స్పష్టమైనప్పటికీ- తను వారి ఇంట్లోనేఉండి, శేషగిరిరావుకు తనవల్ల బాధలేకుండా చేయడానికే సోమేశం నిశ్చయించుకున్నాడు. అలాగే చేశాడు. వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే డబ్బులేని ఆ సమయంలో అతనికి అంతకన్న మార్గాంతర మేమీ లేకపోయినది. కాని దానివల్ల సాధించినదేమిటి సోమేశం ?. తన సలహా కొంచెమో, గొప్పో ఉపకారం చేసిఉన్న తన సలహా పాటించకుండాపోయి నందుకు శేషగిరిరావు సోమేశం సంగతి పట్టించుకోనడం మానివేశాడు. ఇప్పుడు ఏ రోజు అయినా ఇంటికి వెళ్ళితే పరిచితుడైన పరాయి పెద్ద

మనిషితో మాట్లాడినట్లుగా గౌరవించి మాట్లాడతాడు. ముభావంగా ఉంటాడు. సోమేశం యోగక్షేమాలపట్లకాని, ఆఖరికి భార్యాబిడ్డల క్షేమసమాచారాలపట్లకాని రవంత ఆసక్తి అయినా చూపడు. ఎప్పుడైనా సోమేశమే అతని ఇంటికికాని, ఆఫీసుకుకాని వెళ్ళి అతన్ని చూడాలి. కాని అతనుమాత్రం సోమేశాన్ని కలుసుకునేందుకు ఏనాడూ ప్రయత్నించడు. శేషగిరిరావు భార్య సుశీల కూడా నిర్లిప్తంగానే ఉంటున్నది. ఈ పరిస్థితి అంతా గమనించి హృదయానికి బాధాకరంగానే వున్నప్పటికీ సోమేశం జార్జిటౌన్‌లో అతని ఇంటికి వెళ్ళడం మానుకున్నాడు.

మేనత్తగారి ఇంట్లో పరిస్థితికూడా అంతంత మాత్రంగానే ఉన్నది. వేలువిడిచిన సోదరుని కొడుకు ఇంట్లో ఉండడం ఆమెకు మొదట్లో యిష్టంలేదు. కాని ఉండడానికి కాస్త చోటు అయినా ఇవ్వకపోతే బంధుకోటిలో చెడ్డపేరు వస్తుందేమోనని ఆమె భయపడినది. చోటుఇచ్చి సహాయంచేసినట్లయితే ఆ మెహర్బానీ అయినా ఉంటుందని ఆమె ఆశించింది. అన్నింటినీ మించి ఈ పీడ కొలదికాలమేకదా అని ఆమె అనుకున్నది. కాని సోమేశం సంగతి బంధుకోటిలో ఎవరూ పట్టించుకున్నట్లుగా ఆమెకు కనుపించలేదు. మెహర్బానీకూడా ఏమంత ఉన్నట్లుగాలేదు. కొలదికాలమే కదా అనుకున్నది సోమేశం ఇల్లు సంపాదించే ప్రయత్నంలో ఉన్నట్లు ఆమెకు ఎక్కడా కనుపించలేదు. అద్దె అయినా యివ్వవలసిన అవసరం లేకుండా తనుయింట్లో ఉన్నప్పుడు మరి అంత జీతమూ ఏమి చేస్తున్నాడో ఆమెకు అర్థంకాలేదు. ఆ సిగరెట్లకే జీతంఅంతా

అయిపోతోందో ఏమిటో అని ఆమె అనుకున్నది. ఏ రోజూ అతని గదినిండా ఇన్ని సిగరెట్టు పీకలు, ఖాళీ సిగరెట్టు పెట్టెలు చచ్చిచెడి ఊడ్చి బయట పారేయవలసి వస్తున్నది. ఈ కాలపువాళ్ళకు సిగరెట్లు మితిమీరి ఎక్కువగా కాల్చే ఈ దుర్గుణం ఒకటి. అయినా ఈ సంత తమకు ఎందుకు ? ఎక్కడైనా ఇల్లు తీసుకుని కాపురం పెట్టుకుంటే రోజంతా సిగరెట్లు కాల్చినా తమకు అక్కర లేదు. కాని ఈ పీడ వదిలే ఉపాయం కనుపించడంలేదు. త్వరలోనే ఏదోవిధంగా సోమేశాన్ని వదిలించుకుంటేతప్ప మనశ్శాంతి ఉండదు. ఈ మధ్య ఒకసారి అల్లుడు కూతురు వచ్చి పది రోజులపాటు ఉండి వెళ్ళాడు. అప్పుడు కూతురు ఏమన్నది? "వీడు ఎక్కడ దొరికాడే అమ్మా మనకు? అంత అడ్వాన్సు చెల్లించుకుని ఇల్లే సంపాదించుకోలేని దద్దమ్మ మరి పెళ్ళి ఎందుకు చేసుకున్నాడు? ఒక పిల్లాడు కూడా పుట్టాడటగా? వాణ్ణి ఎలా పోషిస్తాడు? పైగా ఇక్కడ ఉన్నన్నాళ్ళూ చూచాంగా? రాత్రి రాత్రంతా వాడి గదిలోంచి ఒకటే సిగరెట్టు పొగ. వెధవ సిగరెట్లూ వీడూను! మీ అల్లుడుగారికి ఒళ్లు మండిపోయిందంటే నమ్మ- 'ఈ సిగరెట్లు కాల్చే వెధవ ఇంట్లో ఉన్నంతకాలమూ మళ్ళీ ఇక్కడికి రానేవ్' అన్నారు నాతో. అందుచేత ఈ వెధవను ఎలాగో ఒకలా వదిలించే ఉపాయం చూడు అమ్మా! నాన్నగారికేమీ తెలియదు. అయినవాడిమీద, కాని వాడిమీద జాలిపడి నెత్తిమీద ఎక్కించుకుంటారు" అని కూతురు బోధచేసినది. ఆ మాటలు

శేషమ్మగారి మనసులో బాగా నాటుకొనిపోయాయి. సుబ్బ రామయ్యగారి వైఖరి ఏవిధంగా ఉన్నా ఒకటే. దానివల్ల వచ్చే మార్పులు ఏమీ ఉండవు. సుబ్బరామయ్యగారికొడుకు ఈమధ్య సెలవులకు ఒకసారి ఇక్కడికి వచ్చి పది పదిహేను రోజులపాటు ఉండివెళ్ళాడు. అతను సోమేశంతో ముభావం గానే ఉన్నాడు. సోమేశంకూడా అతనికి దూరంగానే ఉండి పోయాడు.

ఇది ఇట్లా ఉండగా సోమేశానికి మరొక విధమైన ఒత్తిడికూడా తగిలినది. పురుడు వచ్చిన మూడు నెలలవరకు ఊరకఉన్నప్పటికీ ఆ తరువాత ఇల్లు చూచారా లేదా, ఎప్పుడు తీసుకొని వెళ్ళుతారు అంటూ భార్య లలిత ఉత్తరాలు వ్రాయడం ప్రారంభించినది. ఏనాడూ తనను ఎందుకైనా డబ్బు ఇమ్మని అడగని భార్య పిల్లవాడి పాలడబ్బాలకు ఇతర ఖర్చులకు డబ్బు పంపమని అడగడం ప్రారంభించింది. అది సహజమే. కాని ఆ తరువాతనుంచి "ఇక పుట్టింటిలో ఉండడం సిగ్గుచేటుగా వున్నదనీ, మద్రాసులో ఇళ్ళు సులభంగానే దొరుకుతున్నట్లు ఆ ఊళ్ళో అనుకుంటున్నారనీ, త్వరలోనే ఎక్కడో అక్కడ ఎలాంటి కొంపయినా సరే తీసుకుని వెంటనే తీసుకొనిపోవా"లనీ భార్య వ్రాస్తూన్నది. సోమేశం ఆడక త్తెరలోపడ్డ పోకలా తయారయ్యాడు.

* * *

ఎనిమిది మాసాల అనంతరం ఒకనాడు ఆఫీసులో ఉండగా సోమేశానికి ఫెళ్ళున జ్వరం వచ్చినది. జ్వరం వచ్చినా, మరి ఏమి వచ్చినా పెద్ద ఆర్భాటం చేసే స్వభావం

కాదు అతనిది. స్వభావానికి తగినట్లుగానే తను ఇంటికోసం ఎన్ని ప్రయత్నాలు చేసినది, వాటి కోసం ఎంత డబ్బు వ్యయపరచినది, పెద్ద పెద్ద మొత్తాలు ఇవ్వడానికి తగిన శక్తి లేదన్న ఒక్క కారణం చేతనే ఇల్లు సంపాదించలేక పోయినది– అతను ఏనాడూ ఎవరితోనూ చెప్పుకోనలేదు. ఈనాడు కూడా జ్వరం వచ్చినా అదే బిగువున పని చేసుకు పోవడానికి ప్రయత్నించాడు. ప్రతి నిమిషము సోమేశంతో పని ఉన్న ఆఫీసు మేనేజరు అతని వాలకం కనిపెట్టాడు. వెంటనే సెలవు ఇచ్చి ఇంటికి వెళ్ళిపొమ్మని చెప్పి, బలవంతంచేసి పంపించివేశాడు.

సోమేశం ఒళ్ళుతెలియని స్థితిలో ఇంటికి వచ్చాడు. ఆ తరువాత కదలడానికి ఓపిక ఉంటుందో లేదో అని దారిలోనే ఒక డాక్టరువద్దకు వెళ్ళి మందు తెచ్చుకున్నాడు. డాక్టరు మలేరియా వచ్చినది, ఇంటికిపోయి పడుకోమని చెబుతూ మళ్ళీ మరునాడు రమ్మనమన్నాడు. సోమేశం ఇంటికి వచ్చేసరికి మేనత్త శేషమ్మగారు హాల్లోనే కూర్చుని ఉన్నది. అతని పరిస్థితి చూచికూడా ఏమి పెందరాళే వచ్చావు అనికాని, జ్వరం వచ్చిందా అనికాని ప్రశ్నించలేదు. సోమేశం ఏమీ గమనించకుండా తన గదిలోకి పోయి పక్క పరుచుకుని పడుకున్నాడు. ఆ రాత్రి అతను పస్తు ఉన్నాడు. రాత్రి ఎనిమిది గంటలవేళ మేనత్త గదిలోకి వచ్చి, వంటి మీద చెయ్యివేసి చూడనైనా చూడకుండా "జ్వరం వచ్చినట్లు ఉందే? లంఖణం ఉంటే అదే తగ్గిపోతుందిరా– మరేం ఫరవాలేదు. ఇలాంటివి ఎన్నో చూచాము. సిగరెట్లు

మాత్రం కాల్చకు" అని చెప్పి బయటికి వెళ్ళిపోయినది. సుబ్బరామయ్యగారు ఊళ్ళో లేరు. ఆయన వ్యాపారంమీద కాకినాడ వెళ్ళారు. మరోవారం పది రోజులవరకు మద్రాసు తిరిగిరారు.

ఆ రాత్రి జ్వరం ముమ్మరంగా వచ్చినది. సోమేశం చాల బాధపడ్డాడు. అంత జ్వరంలోకూడా అతను మేనత్త వైముఖ్యంతోకూడిన వైరాగ్యం గమనించాడు. దాహం అయితే మంచినీళ్ళు ఇమ్మనికూడా ఆమెను అడుగకుండా ఉండిపోయాడు.

మరునాడు ఉదయం ఎనిమిది గంటలకు శేషమ్మగారు సోమేశం గదిలోకి మళ్ళీ వచ్చింది. వస్తూనే "ముఖమైనా కడుక్కోకుండా పడుకుని ఉండిపోయావేమిరా? లే, ముఖం కడుక్కో—లేకపోతే శని పట్టుకుంటుం దంటారు. ముఖంచూస్తే జ్వరం తగ్గినట్లే ఉందిలే. నేను మా అమ్మాయిగారి ఇంటికి మాంబళం వెళ్ళుతున్నాను. దానికి కడుపునొప్పిగా ఉంది. రమ్మనమని అల్లుడు కబురంపాడు. వెళ్ళకపోతే బాగుంటుందా మరి? పాపం, జ్వరం వచ్చినవాణ్ణి విడిచివెళ్ళడం నాకూ ఇష్టంలేదు. కాని తప్పదు. నువ్వు ఈవేళకూడా లంఖణం ఉండు—లేకపోతే తిరగబెట్టుతుంది. మధ్యాహ్నం దాసీది వచ్చినప్పుడు దగ్గర ఉండి ఇల్లు అంతా ఊడ్పించు. ఇల్లు జాగ్రత్తగా చూస్తూ ఉంటావుకదూ" అని చెప్పి, వెంటనే రిక్షా ఒకటి పిలిపించుకుని, మరొకసారి ఇల్లు భద్రం సుమా అని హెచ్చరించి, ఆమె మాంబళంలో ఉన్న కూతురుగారి ఇంటికి వెళ్ళిపోయినది.

సోమేశం తనలోనే నీరసంగా చిరునవ్వు నవ్వుకుని, ఇల్లు ఏమైనా కానీ అని మనసులో అనుకుని పక్కకు తిరిగి గాఢమైన నిద్రలో మునిగిపోయాడు.

పగలంతా అతను అలాగే పడుకుని ఉన్నాడు. మధ్యాహ్నం ఎప్పుడో దాసీవచ్చి, సోమేశం ఆసరాలేకుండానే ఇల్లు అంతా ఊడ్చి, చక్కా వెళ్ళిపోయినది. ఆ సంగతి కూడా సోమేశానికి తెలియదు.

ఆ రోజంతా సోమేశం ఎక్కడికీ కదలలేదు. ఆహారం కూడా లేదు. ఆఖరికి గొంతు తడుపుకుందుకు ఇన్ని కాఫీ నీళ్ళు ఇచ్చేవారు అయినా లేరు. అతను చింతించనూ లేదు. మరునాటి ఉదయానికి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. సోమేశం డాక్టరువద్దకు వెళ్ళి మందు తెచ్చుకున్నాడు. అలాగే కాఫీ త్రాగి వచ్చాడు. ఏమైతే అయిందని మధ్యాహ్నం భోజనంకూడా చేశాడు. డాక్టరు ఆరోజుమటుకు భోజనం చేయవద్దని చెప్పినా అతను లక్ష్యం చెయ్యలేదు. కాని అదృష్టవశాత్తు జ్వరం తిరగబెట్టలేదు.

వెళ్ళిన మూడవరోజు సాయంకాలనికల్లా మేనత్త శేషమ్మగారు తిరిగివచ్చింది. మేనల్లుని జ్వరంతగ్గి అతను పథ్యంకూడా పుచ్చుకున్నందుకు సంతోషించినది.

జ్వరం మూలంగా సోమేశానికి జరిగిన ఉపకారం ఒక్కటే. ఏమైనాసరే త్వరలోనే మేనత్తగారి ఇంటినుంచి వెళ్ళిపోవడానికి అతను నిశ్చయించుకున్నాడు. అతను ఆట్టే

అంత కష్టంలేకుండా తన నిర్ణయం అమలు పరుచుకుందుకు మరొకటి తోడయింది.

జ్వరం వచ్చిన తరువాత కొలది రోజులకే సోమేశం మామగారివద్దనుంచి అతనికి ఒక ఉత్తరం వచ్చినది. దానిలో ఇలా ఉన్నది —

"మా ఊరివారి అల్లుడు ఒకాయన తిరువళ్ళిక్కేణిలో ఉంటున్నాడు. ఆయనకు గవర్నమెంటు ఉద్యోగం. సికిందరాబాదు ట్రాన్స్‌ఫర్ అయిందట. నెలాఖరుకు వెళ్ళిపోతున్నారట. ఆయన భార్య అంటే నా స్నేహితునికి కుమార్తె మొన్ననే పుట్టింటికి వచ్చి వెళ్ళింది. ఆమెతో చెప్పాను. ఇంటివారితో చెప్పి వారివాటా మీకు ఇచ్చేటట్టు చేస్తానని ఆమె అన్నది. ఇంటికి పదిహేను రూపాయలే అద్దె. ఒక్కనెల అద్దె అడ్వాన్సు ఇస్తేచాలునట. అందుచేత వెంటనే వారి ఇంటికి వేళ్ళి సంగతి సందర్భాలు తెలుసుకుని ఎలా అయినా ఆ వాటా సంపాదించే ఏర్పాటు చెయ్యి, వారి అడ్రసు ఈ ఉత్తరంలోనే వ్రాస్తున్నాను.

"తా. క. వెంటనే అక్కడికి వెళ్ళి ఈ పని చూడవలెను. చి॥ సౌ॥ అమ్మాయికూడా బెంగగా ఉన్నది. త్వరలోనే తీసుకువెళ్ళి కాపురం పెట్టుకొనడం మంచిది."

బ్రతుకుజీవుడా అనుకున్నాడు సోమేశం. వెంటనే ఆ అడ్రసు ఉన్న ఇంటికి వెళ్ళాడు. శేషగిరిరావుగారి ఇల్లు మాదిరిగానే ఉన్నది. రెండు గదులు, ఒకదానిలోంచి ఒకటి. గాలి, వెలుతురూ లేవు. అద్దె తక్కువ. ఆఫీసుకు

దగ్గర. నెల ఆఖరికి ఖాళీ అవుతుంది. ఒకటవ తేదిన వచ్చి ప్రవేశించవచ్చు. ఒక నెల అద్దె మాత్రం అడ్వాన్సు ఇవ్వాలి. ఇంటివారితో చెప్పితే వారుకూడా అంగీకరించారు. ఇది కాస్తా వదులుకుంటే పుట్టగతులు ఉండవని సోమేశం నెలాఖరుకు ముందుగానే తోడి గుమాస్తాలలో ఒకరివద్ద పది పదిహేను రూపాయలు అప్పు తీసుకుని అడ్వాన్సు చెల్లించాడు. ఆ సంగతి వెంటనే మామగారికి తెలియపరుస్తూ మరుసటి నెల మొదటివారంలో భార్యను, పిల్లవాడిని పంపమని వ్రాశాడు. ఇక్కడికి వచ్చేరోజు తెలియపరుస్తే స్టేషన్‌కు వచ్చి తీసుకుని వెడతానని కూడా వ్రాశాడు.

ఒకటవ తేదీ రాగానే వాటా స్వాధీనం చేసుకున్నాడు. ఆ మరుసటి రోజే తన పక్కచుట్ట చంకన బెట్టుకుని మేనత్తగారితోను, సుబ్బరామయ్యగారితోను ముక్తసరిగా "ఇల్లు దొరికింది, వెళ్ళుతున్నా"నని చెప్పి ఎగ్మూర్‌నుంచి వెళ్లిపోయాడు. మేనత్త శేషమ్మగారు నిజంగానే సంతోషించినది.

వారం దాటకుండానే మంచిరోజు చూచుకుని సోమేశం, భార్య లలిత కుమారుని తీసుకుని మద్రాసు చేరుకున్నది. సోమేశం స్టేషనుకు వెళ్ళి భార్యా బిడ్డలను ఇంటికి తీసుకొని వెళ్ళాడు. మద్రాసులో అతను కుటుంబంతో జీవితం ప్రారంభించాడు.

సోమేశం తన భార్యా బిడ్డలు వచ్చిన సంగతి మేనత్తగారికి తెలియపర్చనూ లేదు; ఆమె దానికి చింతించనూ లేదు.

సోమేశానికి కుటుంబ నిర్వహణకు అవసరమైన చెంబు, తపేలా, కుంచము, కుంపటి వంటి హంగు ఏమీలేదు. ఆ బాపతు సామానులన్నీ అత్తవారే సమకూర్చి పెట్టారు. అది మామగారు సోమేశానికి జీవితంలో చేసిపెట్టిన రెండవ ఉపకారం.

ॐ

సోమేశం జీవితం కొలది కాలం సాఫీగా చెప్పుకొనదగిన ఎట్టి సంఘటనలు కాని లేకుండా జరిగిపోయినది. జీవితం ఒకప్పుడు వంతెన క్రిందనుంచి ప్రవహించిపోయే కాలువలాగా, రోడ్డుమీద నిలబడి చూచే పథికునికి కనుపిస్తూంది. ఒకప్పుడు ప్రచండ ఝంఝూ మారుతం తాకిడికి ఉవ్వెత్తుగా లేచిన ఉత్తుంగ తరంగాలతో కల్లోలితమై పరవళ్ళు త్రొక్కే సముద్రంలా అదే సముద్రంలో చిన్న నౌకపై ప్రయాణం చేస్తూన్న మానవునికి గోచరిస్తూంది. మరొకప్పుడు రసవత్తరమైన నాటకంలా ప్రేక్షకునికి కనుపిస్తూంది.

నీరు అయినా, వేరొకటి అయినా నిమిష నిమిషము ప్రకృతి నియమానుసారము మార్పు చెందుతూనే ఉంటుంది. జీవితం కూడా అంతే. మార్పు లేకుండా ఉండడానికి వీలు లేదు. అయితే ఒకప్పుడు ఆ మార్పు కంటికి గోచరించేటంత ఎక్కువగా ఉంటుంది. మరొకప్పుడు అంతటి ఎక్కువ మార్పు కాకపోవచ్చు. సోమేశం జీవితంలో అతనికి తెలియకుండానే ఎన్నో మార్పులు వచ్చినవి.

తండ్రి బద్దికలో ఉన్నంతకాలమూ సోమేశం స్వతంత్రంగా దేనిని గురించీ ఆలోచించవలసిన అవసరం లేకపోయినది. అట్టిది ఆకస్మికంగా తన అంతట తాను జీవించడానికి ఒక మార్గం ఏర్పరచుకోనవలసిన స్థితిలో పడ్డాడు. మిత్రుడు శేషగిరిరావు సహాయంతో ఆట్టే అంత ఎక్కువ కష్టానికి గురికావలసిన అవసరం లేకుండానే ఒక దారి ఏర్పరచుకున్నాడు. అంతమటుకు సోమేశం అదృష్టవంతుడే అని చెప్పుకోవచ్చు. ఆ తరువాత కాపురం పెట్టుకుని కుటుంబ పోషణభారం (ఎంత చిన్న కుటుంబమైన బాధ్యత ఒక్కటే) స్వయంగా వహించవలసి వచ్చినది. అది కూడా ఆట్టే అంత ఎక్కువ కష్టం లేకుండానే నెరవేరినది.

అంతవరకు సోమేశం ఒక రకంగా డబ్బు చిక్కులు ఎరగడనే చెప్పవచ్చు. భార్యతో కాపురం ప్రారంభించిన నాటి నుంచి సోమేశానికి డబ్బు చిక్కులు ప్రారంభమైనవి. అంతవరకూ ఆఫీసులో జీతంలోంచి ఏ నాడూ అడ్వాన్సు తీసుకోనడం అంటే ఏమిటో ఎరగని సోమేశం అడ్వాన్సులు విధిగా తీసుకోనడం మొదలు పెట్టాడు. జీతం చేతికి రాగానే నెల ఆఖరి రోజులలో తోడి గుమాస్తా మిత్రుల వద్ద తీసుకొన్న చేబదుళ్ళు విధిగా తీర్చివేస్తూ వచ్చిన సోమేశం వాయిదాలు వేయడం మొదలు పెట్టి బకాయిలు పెంచడం సాగించాడు.

దీనికంతటికీ ఆ మనిషిలోని దౌర్బల్యంకాని, దుబారాతనం గాని, నిజాయితీ లేకపోవడం కాని కారణం కాదు.

దానికంతటికీ ఒకటే కారణం. సోమేశం ఉన్నత స్థితిలో ఉండి జీవితం గడుపుకొన జూచే వారందరి పరిస్థితి అదే విధంగా ఉండడానికి కూడా అదే కారణం. సోమేశంది పెట్టుబడిలేని వ్యాపారం. జీవితం కొనసాగించడానికి వ్రాసినమూల ధన మేమీలేకుండా అతను జీవితం ప్రారంభించడానికి పూనుకున్నాడు. అదే అతని చిక్కులకు మూల కారణం. జీవితం డబ్బు కలవారు సాగించవలసిన వ్యాపారం. అంతేకాని దివాలా కోరులు చేయగలిగినది మాత్రం కాదు. ఇంతకుమించి సోమేశం ఆర్థిక స్థితిని గురించి చెప్పుకొనవలసినది లేదు.

అయినా ఈ పరిస్థితి అంతా అతని మనసు విరిచివేయ లేదు. అతని హృదయం కలుషితంచేసి సానుభూతి నశించి పోయేటట్టుకూడా చేయలేదు. స్వతంత్రంగా జీవితం గడుపుతున్నాననే ఆనందం అతనికి అధికంగా ఉన్నది. ఇల్లు సుఖమైనదికాదు. కాని భార్యా బిడ్డలతో కలసిమెలసి మొదటిసారి తనకు తాను బ్రతకడంలో ఉన్న ఆనందంముందు దానికి అతన్ని బాధించగలిగిన శక్తి లేకపోయినది.

* * *

సోమేశానికి నలుగురిలో కలిసి సరదాగా ఒకచోట పనిచేయడంలోకూడా ఒకవిధమైన ఆనందం అనుభవంలోనికి వచ్చినది. ముఖ్యంగా అతను ఒంటరిగా ఉంటూ దాదాపు ఎనిమిది నెలలకాలం పనిచేసిన కాలంలో అతను ఒక వినూత్నమైన అనుభవం సంపాదించాడు.

సోమేశానికి ఆఫీసులో తనతోకూడా పనిచేస్తూన్న నలుగురు గుమాస్తాలతో అధికమైన పరిచయము అనుబంధము,

ఆత్మీయత ఏర్పడినది. వారిలో వెంకటరావు సోమేశానికి మరీ ఆప్తమిత్రు డయ్యాడు. ఈ నలుగురు అయిదుగురు సంఘానికి ఒకరకంగా మన దేశ రాజ్యాంగ వ్యవస్థకు అనుగుణమైన వ్యవస్థ ఏర్పడినది. ఆ అయిదుగురులో ఇరువురు తెలుగువారు, ఒకరు మళయాళీ. ఒకరు కన్నడులు. ఒకరు తమిళులు. ఈ అయిదుగురు ఒక త్రాటిమీద నడిచేవారు. వారిలో వారికి ఎట్టి అరమరికలు విభేదాలు లేవు. డబ్బు విషయంలో సంకోచాలు లేవు. వెంకటరావు మినహాగా తతిమ్మా నలువురు ప్రతి రోజూ మధ్యాహ్నం లంచి విరామ సమయంలో కలసి ఏ హోటల్‌కో ఒక హోటల్‌కు పోయి కాఫీ ఫలహారాలు సేవిస్తూ ఉండేవారు. వెంకటరావుమాత్రం ఇంటివద్దనుంచి ఫలహారం తెచ్చుకుని తినేవాడు. అతనికి కాఫీ సిగరెట్టు అలవాటులేదు.

నిత్యమూ కాఫీహోటల్‌కు పోయే ఈ నలుగురులోనూ ఒకేఒక్క నియమం ఉన్నది. తమిళ సోదరుడు విశ్వనాథన్ అందరిలోకీ కుర్రవాడు. అథమం స్కూల్ ఫైనల్ వరకు అయినా చదువుకున్నవాడు కాదు. నాలుగవ ఫారంలో ప్రవేశించగానే అతని చదువు తెల్లవారిపోయింది. ఆ వెంటనే ఏమైనా పనిలో ప్రవేశించవలసిన అత్యవసరం ఏర్పడినది. ఈ కంపెనీలో డెస్పాచ్ శాఖలో గుమాస్తాగా నెలకు నలభై రూపాయల జీతంమీద ప్రవేశించాడు. అతని తండ్రికి కుమారుని పోషించగలిగిన శక్తిలేదు. ఆయన పింఛన్‌దారుడు. ఆయనకువచ్చే పింఛన్ ఆయన పొట్టపోసుకునేందుకే సరిపోదు. ఆయన, విశ్వనాథన్, విశ్వనాథన్ తల్లి దానిమీదనే ఆధార

పడి జీవించగలగడం సంభవంకాదు. విశ్వనాథన్ సంపాదించే దానితో వారు బ్రతకగలుగుతున్నారు. అతను ప్రతి రోజూ కాఫీ ఫలహారాలకు డబ్బు ఖర్చుచేసినట్లయితే మొత్తంమీద ఆ కుటుంబం అంతాకట్టగట్టుకుని ఏ నుయ్యో గొయ్యో చూచు కొనవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అసలు దానికి విశ్వనాథన్ వద్ద డబ్బు ఉండటంకూడా సాధ్యంకాదు. అతను దురాశా పరుడుకాదు. డబ్బు ఖర్చు అయ్యే అలవాట్లు ఏమీ లేవు. అయినా కాఫీ ఫలహారాదులకు అతనివద్ద డబ్బులేదు. రోజు రోజూ కేవలం రెండుపూట్ల తిండితో మాత్రం పనిచేయగలడం సాధ్యంకాదు. ఈ పరిస్థితి అంతా అతని తోడిగుమాస్తాలకు తెలుసు. పైగా అతనికన్న తమలో ప్రతి ఒక్కరూ ఎక్కువే సంపాదించుకుంటున్నారు. అందుచేత ఈ సంఘంవారు వంతుల వారీగా విశ్వనాథ్‌కు కాఫీ ఫలహారాలు ఇప్పించి ఆ విధంగా అతనికి సహాయం చేయుడం తమ విద్యుక్త ధర్మంగా పరిగణిస్తున్నారు. అదే సంఘంలో కలిసిపోయిన సోమేశంకూడా దానిని తన ధర్మంగా పరిగణించి తానుకూడా అదేవిధంగా చేస్తున్నాడు. మానవులపై పరిసరాల ప్రభావం అంతటిది.

నెల ఆఖరయ్యే సమయంలో కూడా డబ్బు ఉండేవారు చాల కొలదిమంది మాత్రమే. ఈ సంఘంలో అట్టివారు ఎవరూ లేరు. కాని అట్టి సమయాలలో వెంకటరావు ఆపద్బాంధవుడులా అందరినీ ఆదుకుని కొంచెమో గొప్పో సహాయం చేస్తూ ఉండడం కద్దు. ఆయనకు వెనక కొంత ఉన్నది. భాగ్యవంతుడు కాదు. కాని వేడినీళ్ళకు చన్నీళ్ళ తోడు అన్నట్లు సంపాదనకు తోడుగా కొంత ఆదాయం

భూములవల్ల లభిస్తూన్నది. స్వతహాగా చాల జాగ్రత్త అయిన మనిషి. సహాయంచేసే స్వభావం కలవాడు. ఆయనకు ఒక్కతే కుమార్తె. ఆయనకూడా తిరువళ్ళిక్కేణిలోనే హైరోడ్‌లో నివసిస్తున్నాడు. వెంకటరావువద్ద సాధారణంగా ఎక్కడా కనుపించని మరొక మంచిగుణం ఉన్నది. అతను ఎవరితోనూ తన గొడవలుగురించి చెప్పుకొనడు. ఇతరులు చెప్పుకుంటే చెవి యొగ్గి విని, సానుభూతితో వారి సమస్యలు తన సమస్యలుగానే పరిగణించి యథోచితమైన సహాయం చేస్తూ ఉంటాడు. కోరనివారికి సలహాలు ఇచ్చికాని, సహాయం చేసికాని అవసరమైన బెడదలు తెచ్చిపెట్టుకొనడు.

* * *

కుటుంబం తెచ్చుకుని కాపురం పెట్టుకున్న నెలలో సోమేశానికి చాల ఖర్చు అయినది. మూలధనం లేనివాడు కావడంచేత తనకు ఉన్న ఏకైక ఆస్తిని ఉపయోగించుకున్నాడు. వెనకా ముందూ ఆలోచించకుండా సోదర గుమాస్తాలవద్ద అప్పులు చేశాడు. ఆ తరువాత నెలలుకూడా ఆదాయం మించినఖర్చే చేయవలసి వచ్చింది. ఖర్చు తగ్గే ఉపాయం గోచరించలేదు. ఆదాయం పెరిగే మార్గంలేదు. అప్పులు పెరుగుతున్నవి.

ఇదివరలో నెల ఆఖరులోమాత్రం ఎదురౌతూ ఉండిన సమస్య, ఇప్పుడు నెల పొడుగునా ఏ ఒకటి రెండు రోజులో తప్పితే సోమేశాన్ని పట్టుకుని విడిచిపెట్టడంలేదు. ఏ రోజు కారోజు మధ్యాహ్నం పూట కాఫీ ఫలహారాలకోసం

డబ్బులు వెతుక్కోవలసిన అవసరం ఏర్పడినది. అతనుకూడా వెంకటరావుమాదిరిగా ఇంత పలహారం తెచ్చుకుంటే అతని సమస్య కొంతవరకు తీరిపోయి ఉండును. కాని అది సాధ్యం కాదు. పిల్లవాడు అంటే కలిగాడు. మద్రాసువంటి మహా నగరంలో భర్తతో కలిసి కాపురం చేస్తున్నా ఇల్లాలు అయితే కావచ్చు. కాని, లలిత ఇంకా పద్ధెనిమిది ఏళ్ళు అయినా నిండని బాలిక. తల్లివద్దనో, లేక చేసుకున్న భర్త ఇంటిలో-అత్తవారి వద్దనో ఉండి ఇంకా సంసారం నిర్వహించుకొనడం ఎలాగో నేర్చుకోవలసిన బాలిక. ఆ మాటకు న్యాయంగా ఇంకా చదువు సంధ్యలలో కాలం వెళ్ళబుచ్చవలసిన వయస్సులో ఉన్నది. వేళకు ఇంత వండిపెట్టి భర్తను ఆఫీసుకు పంపడమే ఆమెకు బ్రహ్మయజ్ఞంగా ఉన్నది. పిల్లవాడిని సముదాయించుకోవలసిన బాధ్యతకూడా ఆమెపైనే ఉన్నది. దానికితోడు రోజూ ఇంత ఫలహారంకూడ చేసి పెట్టాలంటే ఆమెకు చేతకాదు. ఆమెవల్ల అయ్యేపని కాదు. చేసి పెట్టమని భర్త అడగలేదు.

సోమేశం ఏమైనాసరే ఇంత ఫలహారం తెచ్చుకొనడానికి నిశ్చయించుకొనలేకపోవడానికి మరొక కారణం కూడా ఉన్నది. అదే ఆ రెండింటిలోనూ బలవత్తరమైన కారణం. సోమేశం ఇంతవరకు ఆఫీసులోని తోడి గుమాస్తాలతో కలసి ఒకవిధమైన కార్యక్రమానికి అలవాటుపడి ఉన్నాడు. తోడి గుమాస్తాలలో ఒకవిధంగా మెలగడం నేర్చుకున్నాడు. వారితో అధికంగా కలసి మెలసి ఉండడానికి మాట్లాడుకోవడానికి అవకాశమిచ్చేది లంచి విరామసమయమే. అట్టిది

ఇప్పుడు తాను కూడా వెంకటరావులా ఇంత ఫలహారం తెచ్చుకుని ఆ విరామసమయం కాస్తా ఆఫీసులోనే గడపడం ప్రారంభి స్తే వాటితో ఆ విధంగా కలసి మెలసి ఉండడం సాధ్యంకాకపోవచ్చునని సోమేశం అనుకున్నాడు. మానవుడు అలవాటుకు బానిస. సహజంగానే మార్పు కాంక్షించడు. అలవాటు వదలిపెట్టుకొనలేడు.

సోమేశానికి తోడి గుమాస్తాల సాహచర్యంలో కొంత ఆనందంకూడా ఉన్నది. వారివల్ల అతనికి ఎట్టి ఇబ్బందికాని లేదు. తను వారికి ఏమైనా సహాయం చేయ గలుగుతున్నాడా అంటే తను వారిపట్ల అట్టి సహాయమే పొందగలుగుతున్నాడు కూడా. వారు సోమేశంనుంచి దేనినీ కోరరు నిర్బంధించరు. బాధించరు, అధమం అతని వ్యవహా రాలు గురించి ఏమైనా తెలుసుకోవాలనే కుతూహలంకూడా వ్యక్తపరచరు. కొంతవరకు చదువుకుని, కొంతవరకు ప్రపం చాన్ని అర్థంచేసుకుని, ఇతరుల జీవితాలలో జోక్యం చేసుకొన కుండా, అదేవిధంగా తమ జీవితాలలో ఒకులను జోక్యం చేసుకొననీయకుండా బ్రతుకనేర్చినవారితో మాత్రమే అట్టి సంబంధం సాధ్యం. వాతో సాహచర్యం సోమేశానికి ఆనంద కరంగా ఉండటంలో ఆశ్చర్యంలేదు. ప్రతి మానవుడు స్నేహము, సానుభూతి వాంఛిస్తాడు. అంతకన్న ఎక్కువగా తన ఇచ్ఛవచ్చినవిధంగా తాను జీవించడానికి ఇతరులు ఎవరూ ప్రతిబంధకం కాగూడదని వాంఛిస్తాడు. ఈ రకమైన స్నేహ సంబంధము, అనుకూల వాతావరణము లభించినప్పుడు దానిని పోగొట్టుకొనడానికి ఎవరూ అంగీకరించలేరు.

ఆఫీసులో ఉన్న సమయంలో అందులోనూ ఆ లంచి విరామసమయంలోనూ ఎప్పుడైనా ఆఫీసు విడిచినతరువాతను తప్పితే సోమేశం తోడి గుమాస్తాలతో కలసిఉండడానికి తగిన సావకాశంలేదు. వెంకటరావు, సోమేశం మినహాగా తతిమ్మా ముగ్గురూ ఆఫీసుకు దూరంగా వేరు వేరు ప్రదేశాలలో నివసిస్తున్నారు. పైగా ఇతర సమయాలలో కూడా వారిని కలిపి ఒకచోట బంధించి ఉంచగలిగిన సూత్రాలు ఏమీ లేవు. వారందరినీ ఆఫీసులో అయినా బంధించి ఉంచిన ఏకైక సూత్రం వారందరు ఒకచోట పనిచేస్తూఉండడం మాత్రమేకాని తదన్యంకాదు. ఇంకా ఈ స్నేహంనుంచి సోమేశం ఏమైనా అధికంగా కోరుకున్నాడో లేదో చెప్పడం కష్టం. కాని ఇది అంతా పోగొట్టుకొనడానికి మాత్రం అతను అంగీకరించలేకపోయాడు.

నిత్యమూ తాను అనుసరిస్తున్న కార్యక్రమాన్ని సోమేశం విడిచిపెట్టుకొనలేక పోవడానికి మరొక కారణం కూడా ఉన్నది. ఈ ఆఫీసులో చేరినది మొదలు అతను ఒక విధంగా డబ్బు ఖర్చుచేయడానికి అలవాటుపడి ఉన్నాడు. పైగా తతిమ్మా గుమాస్తాలతో కలసి విశ్వనాథన్ పోషణ భారం కొంతవరకు వహించడంలో తన స్థితికి మించిన ఖర్చు చేయడానికి కూడా అలవాటుపడి ఉన్నాడు. ఇప్పుడు ఆ కార్యక్రమానికి, ఆ విధంగా డబ్బు ఖర్చుచేసే పద్ధతికి స్వస్తి చెప్పుకున్నట్లయితే దానికి తగినంత స్థితి తనకు లేదని తోడి వారు ఊహించవచ్చు. లేదా కాపురం పెట్టుకున్నవాడు కావడంచేత ఖర్చు తగ్గించుకుని డబ్బు ఆదాయం చేసుకొన

డానికి ప్రయత్నిస్తున్నాడని వారు భావించవచ్చు. లేక వారి జీవిత విధానాన్నే నిరసిస్తున్నాడని అనుకోవచ్చు. ముఖ్యంగా తను అందరికన్న తక్కువ స్థితిలో ఉన్న విశ్వనాథన్ పట్ల సానుభూతి చంపుకుని అతనికి సహాయం చేయడం మాను కుంటున్నాడని తలంచవచ్చు. ఏ పరిస్థితిలో అయినా ఇది చాల అవమానకరమైన విషయంగా సోమేశానికి తోచినది. అందుచేత అతను ఈ విధంగానే జీవితం సాగించడానికి నిశ్చయించుకున్నాడు.

* * *

క్రమంగా సోమేశం తనకు భారమయ్యాడు. అంతటితో ఆగకుండా ఇతరులకు అంటే తన తోడి గుమాస్తాలకు కూడా భారమయ్యాడు. ఇదివరలో సోమేశం కొంచెం ఆలోచనలో పడితేచాలు "ఏం భాయీ, విచారంగా కనపడుతున్నావ్? ఏమిటి సంగతి? డబ్బు కావాలా?" అని అడిగి డబ్బు ఇవ్వడానికి సంసిద్ధపడేవారు తోడి గుమస్తాలు. "నీతో ఒక మాట మాట్లాడాలోయ్" అని అంటే చాలు "రేపు మాట్లాడుదాంలే. ఈవేళ తీరిక లేదు" అనడమే కాకుండా సోమేశం ఎక్కడ డబ్బు అడుగుతాడో అని "ఈనెల చాల చిక్కుగా ఉందోయ్, సోమేశం. ఎక్కడ అయినా ముష్టి ఎత్తి నాలుగు రూపాయలు సంపాదిస్తేతప్ప రోజులు గడిచే ఉపాయం కనపడటంలేదు" అంటున్నారు. ఇంకా నిర్బంధించి ఎలాగో ఒకలాగు ఏమైనా డబ్బు ఇమ్మని అడిగితే "మమ్మల్ని చంపకు బాబూ? మేము ఏమీ చేయలేము" అని స్పష్టంగా

చెప్పివేస్తున్నారు. ఇతర విషయాలలో మాత్రం మామూలు గానే వుంటున్నారు. దానికి వారిని అనవలసిన పని కూడా లేదు. వారు యిదివరకే సోమేశానికి చాల డబ్బు బదులు యిచ్చి వున్నారు. అది యింతవరకు సోమేశం తిరిగి యివ్వ లేదు. అతని పరిస్థితి చూస్తే ఎప్పటికి తిరిగి యిస్తాడో యివ్వడో కూడా వారికి తెలియదు. అతనితో స్నేహం చేసినందుకుగాను ఈమాత్రం మూల్యం చెల్లించుకొనడం చాలు. ఇంకా అతనికి డబ్బు యిస్తే అదికూడా ఆ గోయి లోనే పారవేసినట్లు అవుతుంది. దానివల్ల నష్టమేకాని లాభ మేమీ లేదు. అందుచేత అతనికి యింక ఏమీ డబ్బు యివ్వ కూడదనే వారిలోవారు నిశ్చయించుకున్నారు.

అయినా సోమేశం తోడి గుమాస్తాలతో కలసి రోజూ యథావిధిగా కాఫీ ఫలహారాలకు పోవడంమాత్రం తప్పడం లేదు. అతను అందుకోసమని జీతం చేతికివచ్చిన తరువాత స్వల్పంగా వెనుక వేసి ఉంచుతున్నాడు. అది పూర్తి అయిన తరువాతనుంచి తోడి గుమాస్తాలలో ఎవరో ఒకరు కొలది అతనిఖర్చు భరిస్తున్నారు. తరువాత మరికొలది రోజులవరకు కాఫీ ఫలహారాలకు సరిపడేటంత అప్పుగాకూడా ఇస్తున్నారు. అదికూడా కొలది రోజులు సాగిన తరువాత సోమేశం ఆప ద్బంధువు అయిన వెంకటరావుమీద పడుతున్నాడు. ఈ విధంగా ఎలాగో ఒకలాగున నెల అంతా గడిచిపోతు న్నది. ఇది సోమేశానికి అవమానకరంగా తోచలేదు. కాని ఆ కార్యక్రమం విడిచిపెట్టుకొనడం మాత్రం అతనికి నిశ్చ

యంగా అవమానకరంగానే తోచినది. ఇప్పటికీ అలాగే కనిపిస్తున్నది.

ఈలోగా వెంకటరావు సాహసించి, ముఖ్యంగా సోమేశం క్షేమం కాంక్షించి, ఇంటివద్దనుంచి ఏ ఫలహార మైనా లేక కారియర్‌లో ఇంత భోజనమైనా తెచ్చుకుంటూ వుండమనీ, ఆ విధంగా కొంత ఖర్చు తగ్గించుకొమ్మని చెప్పాడు. సోమేశం దానిని గురించి ఆలోచిస్తూన్నట్లు ఆయనకు సమాధానం అయితే చెప్పాడుకాని అలా చేద్దామని ఎంతమాత్రమూ అనుకోలేదు.

ఈలోగానే క్రమంగా రోజులు గడచిన కొలది రామేశం విషయంలో స్నేహితుల ప్రవర్తన మార్పు చెందడం ప్రారంభించినది. కాఫీ ఫలహారాలకు వారు సోమేశాన్ని ఆహ్వానించడం మానుకున్నారు. అతనుకూడా వచ్చే వరకు నిలిచి ఉండలేదు. అతను తమతోకూడా వచ్చినా అతని సంగతి అట్టే అంతగా పట్టించుకొనడంలేదు. అతనితో ధారాళంగా మాట్లాడడమైనాలేదు. పైగా అతను తమతో కూడా ఉన్నప్పుడు అతనికి సంబంధించిన విషయాలుగురించి మాట్లాడుకొనడమో లేక తాముకూడా గంభీరంగా ఏమీ మాట్లాడకుండా వుండడమో సాగిస్తున్నారు. ఇది కూడా సోమేశం అంతగా పట్టించుకుని బాధపడలేదు.

కాని ఈ పరిస్థితికి మరొకటి తోడు అయినది. సోమేశం స్థితిలోవచ్చిన మార్పువల్ల తోడి గుమాస్తాలు అందరిలోనూ ఎక్కువబాధ కలిగినమనిషి ఒకడు ఉన్నాడు. అతను విశ్వనాథన్. సోమేశం ఆఫీసులో ప్రవేశించకముందు ఆ ఇరువురు

(అంటే ఆ మళయాళీ, కన్నడ సోదరులు) గుమాస్తాల సాను భూతి సంపాదించి, వారివల్ల కొంత సహాయం పొందడానికి అతను ఎంతో ఎక్కువగా కష్టపడ్డాడు. సోమేశం ప్రవేశిం చిన తరువాత అతనికి ఇతోధికమైన సహాయం లభించినది. కాని ఇప్పుడు అతనికి పోటీ వచ్చినది. ఆ ఇరువురు బ్రహ్మ చారి గుమాస్తాలు తనతోపాటు సోమేశానికికూడా ప్రతి నిత్యమూ సహాయం చేయడానికి పూనుకున్నట్లయితే చివరికి తనకు జరుగుతున్న సహాయం పోతుందేమోనని విశ్వనాథన్ భయపడ్డాడు. యాచకో యాచకః శత్రుః అన్న నానుడి ఈ విధంగా ఋజువు అయినది. అందుచేత విశ్వనాథన్ తన స్థితి చెడిపోకుండా చూచుకొనడానికి ప్రయత్నం ప్రారంభిం చాడు. సోమేశం పట్ల తోడి గుమస్తాలు ఉదాసీనంగా ఉండే టట్లు చేయగలిగితేచాలు. అతని పని నెరవేరుతుంది. అతను అప్పటినుంచి సోమేశం వ్యవహారాలన్నీ పనిగట్టుకుని పూస గుచ్చినట్లుగా తెలుసుకుని తోడి గుమస్తాలకు నివేదించడం మొదలుపెట్టాడు. అదృష్టవశాత్తు సోమేశం డబ్బు చిక్కులే అతని ప్రయత్నానికి తోడుపడినవి.

ఆ ఇరువురు గుమాస్తాలు కూడా బ్రహ్మచారులు. సాధారణంగా మధ్యతరగతివారందరివలెనే బ్రతికి చెడిన కుటుంబాలనుంచి వచ్చినవారు. వారికి కష్టాలు గురించిన అనుభవం తక్కువ. దానికితోడు వివాహితులైన వారి సమ స్యలు గురించి చూచాయగా తెలుసునేకాని వాస్తవ పరిస్థి తులు తెలియవు. ఆ బృందానికి నాయకుడైన మళయాళీ సోదరుడు గోపాలమీనన్ ఒక విషయం గురించి చాల

ఖచ్చితమైన అభిప్రాయాలు వున్నవి. పురుషులు కష్టపడితే పడవచ్చు. కాని తనపై ఆధారపడిన స్త్రీలనుకాని, పిల్లలను కాని ఏమాత్రమూ కష్టపెట్టకూడదు. దానికి కారణాలు ఎట్టివి అయినా అట్టివి జరిగితే మాత్రం అతను సహించ లేడు. మండిపడిపోతాడు.

* * *

పరిస్థితులు ఈవిధంగా వుండగా ఒక నెల ఆఖరి రోజుల్లో లలితకు జ్వరంవచ్చి మంచానపడింది. సోమేశం చాల చిక్కులలోపడ్డాడు. కొడుకు సుందరం బొత్తుగా అడ్డాలలో బిడ్డడు కాకపోవడంచేతను ముఖ్యంగా పొరుగు కుటుంబాలవారిలో ఒకరు చేరదీసి చూస్తూ వుండడంచేతను, సుందరం విషయంలో అట్టే అంత ఎక్కువకష్టం లేకపోయినది. కాని భార్యను కనిపెట్టుకుని ఉండటానికి తనకు వేళకు వంటచేసి ఆఫీసుకు పంపడానికి ఎవరూ లేకపోవడం మూలంగా సోమేశం నిర్బంధంగా ఆఫీసుకు సెలవుపెట్టవలసివచ్చింది.

రెండవచిక్కు భార్యకు సరియైన వైద్యం చేయించడానికేకాదు. అధమం ఏడాక్టరుకు అయినా చూపించి ఇంత మందు పోయించడానికి అతనివద్ద డబ్బులేకుండా పోయినది. సోమేశం ఆ నెల అప్పటికే జీతంలో కొంత డబ్బు అడ్వాన్సు తీసుకున్నాడు. ఇంక అడ్వాన్సు ఇవ్వరు. తోడి గుమాస్తాలందరికీ డబ్బు బాకీ వున్నాడు. వారు ఇంక తనకు డబ్బు ఇవ్వరు. వారిని కూడా అడిగాడు. వారు ఇవ్వలేదు. వెంకటరావుకు కూడా డబ్బు ఇవ్వవలసి వున్నది.

అయినా అతన్ని మళ్ళీ అడగడానికి ఎట్టి అనుమానమూ సోమేశానికి లేదు. వెంకటరావు ఆ నెల డబ్బు అవసర మైన పరిస్థితిలో వుండి సెలవుపెట్టి స్వగ్రామమైన నిడద వోలుకు వెళ్ళి డబ్బు తీసుకుని వద్దామని అనుకుంటు న్నాడు అతను రెండుమూడు రూపాయలకన్న సోమేశానికి ఇవ్వలేకపోయాడు. ఆ డబ్బుతో లలితను ఒకసారి డాక్టరు వద్దకు తీసుకునివెళ్ళి చూపించి రెండు రోజులకు సరిపడే మందు పట్టుకొని వచ్చాడు సోమేశం. అంతకుమించి అతని వద్ద మరి దేనికీ డబ్బు లేకుండాపోయినది. సోమేశానికి ఏ డాక్టరుతోనూ అరువు వైద్యం చేయించుకునేపాటి స్నేహం కాని, పరిచయంకాని లేదు. అందుచేత అతడు మాట్లాడక ఊరుకొనవలసిన పరిస్థితి ఏర్పడినది.

భార్య జ్వరంతో మూసిన కన్ను తెరవకుండా రెండు రోజులు పడుకునివుంటే సోమేశం ఏమీ చేయకుండా ఊరు కొనిఉండలేకపోయాడు. డబ్బు సంపాదించడానికి ఉపా యాలు ఏమీ లేవు. డబ్బు పుట్టించడానికి కేవలం మరొక్క ఉపాయంమాత్రం మిగిలివున్నది. ఏమైనా తాకట్టుపెట్టడమే. తాకట్టుపెట్టడానికి సోమేశంవద్ద ఏమీ లేదు. కాని భార్యవద్ద కొంత బంగారం ఉన్నది. ఆమె చేతులకు ఒక జత గాజులు, మెడలో రెండుపేటల గొలుసు ఒకటి ఉన్నవి. వాటిలో ఏమైనా, అధమం ఒక జత గాజులుఅయినా తాకట్టుపెట్టి ఏమైనా కొంత డబ్బు తీసుకుని, భార్యకు వైద్యం చేయించా లని సోమేశం అనుకున్నాడు. ఆ ఆలోచనమీద మరొక ఆలోచన కూడా పుట్టింది. ఆ బాపతు డబ్బు ఏమైనా

మిగిలితే నాలుగు అయిదు చిల్లర అప్పులు కూడా తీర్చుకుని కొంత బెడద వదలించుకోనవచ్చు. అంతవరకు ఎప్పుడూ లేదు, సోమేశం భార్య నగలు గురించి ఇట్టి ఆలోచన ఆలోచించటం అంతమట్టుకు నిజం. కాని ఆమె జ్వరం, ఇతరత్రా అప్పు పుట్టకపోవడం అతనికి అట్టి ఆలోచన కలుగడానికి కారణ మైనవి.

ఎట్టకేలకు సోమేశం సాహసించాడు. ఉపేక్ష చేయడం వల్ల భార్య పరిస్థితి విషమిస్తుందేమో అనే భయం అతన్ని తొందరచేసినది. భార్యతో ఆ విషయం గురించి ప్రస్తావించాడు.

"చూడు, లలితా, ఎక్కడా ఎర్రని ఏగానీ కూడా దొరికే ఆశలేదు. డాక్టరు మనకు చుట్టమూ కాదు. ఇంకే ఉపాయమూ కనుపించక ఇలా అంటున్నాను. ఏమీ అను కోకు. నీ గాజులు తాకట్టుపెట్టి ఏమైనా డబ్బు తీసుకొని వస్తాను. నీ జ్వరం నయమయితే తరువాత చూసుకోవచ్చు. జీతం రాగానే మొట్టమొదట నీ గాజులు వదలించుకోవచ్చు.

"నా జ్వరం నయంకాక ఏమౌతుంది? రేపు మామూలుగా లేచి తిరగవచ్చు. కొంచెం నీరసంగా వున్న దన్నమాటేకాని ఈ వేళ జ్వరంలేదు. కావలిస్తే చేయి చూడండీ. ఈమాత్రందానికి తాకట్టుపెట్టడంకూడా ఎందుకు? ఏదైనాసరే తాకట్టు పెట్టామంటే అది మళ్ళీ మన చేతికి రాదు. తాకట్టూ వద్దు ఏమీ వద్దు. మాట్లాడక పూరుకోండి. నా జ్వరం అదే తగ్గిపోతుంది" అని అలా జ్వరంగా వుండే నీరసంగా అన్నది లలిత.

సోమేశం ఎంత చెప్పినా లలిత వినలేదు. అతను ఆమెకు చెప్పనూలేకపోయాడు.

చేతకానితనం ఒకవంక పరిస్థితుల కర్కశ ప్రభావం మరొకవంక బాధించగా సోమేశం విమూఢునివలె తయారయ్యాడు.

ఆ స్థితిలో విశ్వనాథన్ అతన్ని చూడడానికి వచ్చాడు. తోడి గుమాస్తాలలో ఒకరు కనిపించేసరికి సోమేశం తన పరిస్థితి అంతా అతనితో చెప్పుకుని మనసులోని ఆవేదన అంతా వెళ్ళగ్రక్కాడు, విశ్వనాథన్ రాకకు ప్రత్యేకమైన కారణ మేమీలేదు. సోమేశం తోడి గుమాస్తాలలో విశ్వనాథన్ ఒక్కడే ఏ సాయంకాలమైనా సోమేశంతో కలసి అతని యింటికి వచ్చి చూచిపోతూవుండడం పరిపాటి. అది అయినా పున్నమికి అమావాస్యకు ఒకసారి అని చెప్పుకోవచ్చు. అతను వచ్చి చాల రోజులు కావడంచేతను, సోమేశంఆ ఫీసుకు వస్తూ ఉండకపోవడంచేతను ఒకసారి చూచిపోదా మనుకున్నాడు విశ్వనాథన్. సోమేశం ఆఖరికి తన భార్య గాజులు తాకట్టు పెట్టుదా మనుకొనడము, భార్య ససేమిరా అంగీకరించక పోవడము కూడా అతనితో చెప్పుకున్నాడు. విశ్వనాథన్ సానుభూతితో అంతా విని వెళ్ళిపోయాడు. మరు నాడు సానుభూతితో ఈ విషయం అంతా సవిస్తరంగా తోడి గుమాస్తాలు గోపాలమీనన్, కన్నడ సోదరుడు కృష్ణ మూర్తిగారలకు తెలియపరచాడు. స్వభావానికి తగినట్లుగానే గోపాలమీనన్‌కు సోమేశంమీద విశేషమైన ఆగ్రహం వచ్చింది, జుగుప్సకూడా కలిగినది. తీవ్రమైన జ్వరంలో

మంచాన పడిన భార్యకు సరిఅయిన వైద్యంసహితం చేయించలేని, చేయించని మనిషితో స్నేహం తనకు అవమానకరమని అతడు అనుకున్నాడు. అందులోనూ భార్య చేతి గాజులు కూడా తాకట్టు పెట్టడానికి సిద్ధమయ్యే మనిషి ఏపాటి మగవాడని అతనికి అనిపించినది. గోపాలమీనన్ స్వయంగా ఏనాడూ అట్టి పరిస్థితిలో లేడు. అందుచేత అతను ఆ విధంగా అనుకోనడంలో ఏమంత అన్యాయం లేదు.

వచ్చిన ప్రతి జ్వరము, ప్రతి జబ్బు ప్రాణం తీయలేవు కదా? లేకపోతే ప్రపంచంలో ఇంత జనాభా వుండడం సంభవంకాదు. లలిత జ్వరం నాలుగవనాటికల్లా పూర్తిగా తగ్గిపోయినది. నీరసంగా వున్నా ఆ మరునాటినుంచే ఆమె భర్తను పిల్లవాడిని చూచుకుంటూ వంటా పెంటా చేసి, భర్తకు నచ్చచెప్పి. భర్తను ఆఫీసుకుకూడా పంపించింది.

లలిత జ్వరంతో ఆఫీసులో పరిస్థితి అంతా తారుమారు అయినది. వెంకటరావు వూళ్ళో లేడు. తతిమ్మా గుమాస్తాలు బాహాటంగానే సోమేశాన్ని పురుగును దులిపినట్లు దులిపివేపి తమ మానాన తాము ఉంటున్నారు. గోపాలమీనన్ సోమేశం ముఖంమీదనే అతను చేసిన పని ఎంత నీచమైనదో చెప్పి అతన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాడు. విశ్వనాథన్ అసలు సోమేశంతో మాట్లాడడమే లేదు.

సోమేశం ఒక సంగతి బాగా అర్థంచేసుకున్నాడు. తను కష్టసమయంలో ఉండి మనసు ఉండబట్టలేక బయటికి వెళ్ళగ్రక్కినదంతా విశ్వనాథన్ ప్రచారం చేశాడు. లేకపోతే ఆ సంగతి మరొకరికి తెలియడానికి అవకాశమేమీ లేదు.

అది విని తోడి గుమాస్తాలు తనను నీచంగా చూస్తున్నారు. గోపాలమీానన్ ధోరణిమాత్రం సోమేశానికి సుతరామూ అర్థంకాలేదు. కాని ఒకటి నిజం. ఇక తనతో సాహచర్యం తన తోడి గుమాస్తాలు కోరరు. తనతో ఎట్టి సంబంధమూ పెట్టుకోనరు. ఇక తనుకూడా వారితో ఏమైనా సంబంధం ఉండడం అనవసరమేకాదు. తనకు మరింత భాధాకరం కూడా అని సోమేశం అనుకున్నాడు.

వెంకటరావు సెలవు ముగిసినవెనుక ఆఫీసుకు రాగానే అతనితో ఇదంతా వెళ్ళబుచ్చుకుని తృప్తిచెందాడు సోమేశం. సోమేశం చెప్పినది విని వెంకటరావు ఆశ్చర్యం పొందలేదు. అతనికి తతిమ్మా గుమాస్తాలతో సోమేశానికి ఉన్న పరిచయం కన్న ఎక్కువే ఉన్నది. ఇట్టి పరిణామం ఏనాడో ఒకనాడు వస్తుందనికూడా అతను ముందే ఊహించగలిగాడు. ఎటు వచ్చీ దానివల్ల సోమేశం మనసు పూర్తిగా విరిగి పోకుండా ఉండాలనే వెంకటరావు కోరిక. అందుచేత తోడి గుమాస్తాలకు కొంతకాలంమైనా దూరంగా ఉండమని సలహాఇచ్చాడు. ఇకనుంచి అయినా మధ్యాహ్నం పూటకు ఫలహారం తెచ్చుకుని, ఆ విరామసమయం తనతోపాటు ఆఫీసులోనే గపడమని చెప్పాడు. ఈ విషయం సోమేశం భార్యతో ప్రస్తావించగా ఆమె ఒక మాట అన్నది. ఉదయం వంటచేసి ఏమైనా ఫలహారం కూడా చేసిపెట్టడం సాధ్యంకాదు గనుక ఇంత పెరుగు అన్నం ఒక డబ్బాలో పెట్టుకుని తీసుకొని వెళ్ళితే మంచిదని ఆమె అన్నది. పెరుగూ అన్నమూ శరీరానికి మంచిదనికూడా ఆమె అన్నది, వెంకటరావే డబ్బు ఇచ్చి దగ్గరఉండి సోమేశం

క.ని 1496



చేత ఒక డబ్బా కొనిపించాడు: కాఫీకి ఫ్లాస్కు కొని ఇచ్చాడు. ఒక చేతిసంచికూడా కొనిపించాడు. ఆ విధంగా సోమేశానికి ఒక సమస్య పరిష్కారం అయినది. ఇక తోడి గుమాస్తాలకు ఇవ్వవలసిన డబ్బు త్వరలోనే ఇచ్చివేసి, వారి ఋణంనుంచి విముక్తుడు కావడానికికూడా సోమేశం నిశ్చయించుకున్నాడు.

తోడి గుమాస్తాలకు కొంత భారం తగ్గినది. ఆవిధంగా వారికికూడా ఉపకారమే జరిగినదని చెప్పవచ్చు. సోమేశం తమతో చేరకముందు వారు ఒక విధమైన జీవిత విధానానికి అలవాటుపడి వున్నారు. సోమేశం వచ్చినతరువాత వారితో కొంతకాలం కలసి ఉన్నారు. అతను కలియడంవల్ల వారికి కొత్త సమస్యలు వచ్చినవి. కాని, ఎట్టి ఆనందదాయకమైన మార్పుకాని రాలేదు. ఇప్పుడు సోమేశం వారినుంచి విడిపోయాడు. వారు మళ్ళీ ఎప్పటివలెనే తమ పూర్వపు జీవిత విధానం అనుసరించసాగారు. సోమేశం వచ్చిపోవడంవల్ల వారికి కొంత డబ్బు నష్టంకావడం మాత్రమే జరిగింది.

## ౭

ఆఖరికి నిత్యమూ ప్రాణం పోషించుకొనడానికి అవసరమైన కాఫీ ఫలహారాలకు డబ్బు ఖర్చుచేయడానికి తగిన ఆర్థిక స్వాతంత్ర్యంకూడా లోపించగా సోమేశం మద్రాసు నగరంలోని వేలాది సామాన్యమైన గుమాస్తాల మాదిరిగా జీవితం ప్రారంభించి దాదాపు ఒక ఏడాది దాటిపోయినది.

అతని ఆర్థిక పరిస్థితి నానాటికి విషమిస్తూ వచ్చినదే కాని ఏ మాత్రమూ బాగుపడలేదు. అయినా ఇంతవరకు సోమేశం ఇంకా అదృష్టవంతుడనే చెప్పుకోవచ్చు. మద్రాసులో అతనికి వచ్చే జీతంమీద అతనికి వున్నపాటి సౌకర్యాలు, అతను అనుభవిస్తున్నపాటి ఆనందముకూడా కరవు అయిన వారు చాలమందే ఉన్నారు. ఇంతవరకు అతని జీవితం ఒకరకంగా సాగిపోతున్నది. చెప్పుకోనదగిన విషయ మేమంటే ఇతరులు ఎవరివల్ల కాని, ముఖ్యంగా బంధువులు ఎవరి వల్ల కాని అతని సాంసారిక జీవనంలో ఎట్టి ఒత్తిడి కలతలు కొత్త సమస్యలు రాలేదు. అతనికి వచ్చే ఆదాయం అతనికి జీవిత నిర్వహణకు సరిపోదు. అప్పులు అవుతున్నవి. క్రమంగా పెరుగుతున్నవి. వాటిని తీర్చుకునే ఉపాయం లేదు. తీర్చుకోనకుండా ఉండడానికి వీలులేదు. ఆదాయం పెరగడానికి మార్గంలేదు. ఈ ఆఫీసులో ఉండగా అతని జీతం పెరిగే సూచనలు కనుపించడం లేదు. అంతకన్న ఎక్కువ జీతంమీద అతనికి ఉద్యోగం ఇచ్చేవారు ఎవరూ దొరకలేదు. అసలు అతని ఇచ్చవచ్చినట్టుగా వుద్యోగం మార్చుకోనడానికికూడా ఇతర వుద్యోగాలు ఏమీ కనుపించడంలేదు. అట్టి ప్రయత్నాలు కూడా చేసి విసుగుజెంది ఊరక ఉన్నాడు సోమేశం.

ఈ స్థితిలో అతని జీవితంలో తలవని తలంపుగా ఒక మార్పు వచ్చినది. సుందరానికి రెండేళ్ళు నిండినవి. సోమేశం, లలిత యథాశక్తి కుమారుని జన్మదినోత్సవం జరిపి ఆనందించారు. సుందరానికి రెండేళ్లూ నిండిన కొలదిరోజులకే

సోమేశం మామగారు నరసింహంగారివద్దనుంచి అతనికి ఒక లేఖ వచ్చినది. ఆ లేఖలోఉన్న సారాంశం ఇది:—కుమార్తె అల్లుడు, మనుమడు క్షేమంగా ఉన్నందుకు మామగారు ఇంట్లో అందరూ సంతోషిస్తున్నారు. అల్లుడు జాగ్రత్తగా వుద్యోగం చేసుకుంటున్నందుకు, అభివృద్ధిలోనికి వస్తూన్నందుకు మామగారికి మరీ ఆనందంగా ఉన్నది. మామగారి ప్రథమ కుమారుడు ఇంకా అదే ప్లీడరు గుమాస్తా ఉద్యోగం చేసుకుంటూ కులాసాగా ఉన్నాడు. ఇప్పుడు మామగారి ద్వితీయపుత్రుడు రాఘవరావు (ముద్దుపేరు రాఘవుడు) గురించే ఆయనకు చింత పట్టుకున్నది. రాఘవుడుకూడా సోమేశవంలెనే స్కూల్ ఫైనల్ వరకు చదువుకున్నాడు. (ఒక్కటే తేడా. రాఘవుడు స్కూల్ ఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణుడు అయినా కాకపోయినా ఒకటే. అది తెలివితేటలు కొలవడానికి పనికివచ్చే సాధన మేమీకాదు. కాని వుద్యోగాలు ఇచ్చే దాతలుమాత్రం వేరువిధంగా తలంచవచ్చు.) మద్రాసులో వుద్యోగాలు సులభంగా కాకపోయినా కొంత ప్రయత్నంమీద అయినా దొరుకుతవి. అందుచేత మామగారు త్వరలోనే ఒక మంచిరోజు చూచి రాఘవుని తమ అల్లుని వద్దకు పంపుతున్నారు. రాఘవుని విషయంలో చేయవలసినదంతా అల్లుడు చేయగలడని మామగారు నమ్ముతున్నారు. మామగారి ఇంటివద్ద అందరు క్షేమం. ఇక్కడ అంటే మద్రాసులో వున్నవారందరికి మామగారి ఆశీర్వాదములు.

ఇదే సందర్భంలో సోమేశం మామగారు అయిన నరసింహంగారి స్థితిగతులు గురించి, ఆయన మనస్తత్వం గురించి

కొంత తెలుసుకోవడం మంచిది. నరసింహం గారు రాజమండ్రిలో ఒకానొక ప్రముఖ న్యాయవాదివద్ద గుమాస్తాగా పని చేసి రిటైర్ అయ్యాడు. ఆ వృత్తిలో పింఛన్ సౌకర్యం లేదు. మరొక సౌకర్యం మాత్రం ఉన్నది. న్యాయవాదికి సేవ జేస్తూ ఆయనకు డబ్బు చేసి పెట్టడంతో పాటుగా భగవంతుడు ఇచ్చిన తెలివితేటలు ఉపయోగించుకుని చేతనయితే గుమాస్తాకి కూడా స్వంతానికి కొంతడబ్బు చేసుకోవచ్చు. ద్వితీయ ప్రపంచ సంగ్రామానికి ముందు కాలం ఒక విధంగా బీదజనుల పాలిటి కన్నతల్లి వంటిది. నరసింహం గారు యజమానుల క్షేమంతో పాటు తన క్షేమానికి కూడా కొంత పాటుపడ్డారు రిటైర్ అయి స్వగ్రామం చేరుకునేసరికి ఎనిమిది ఎకరాల సుక్షేత్రమైన మాగాణి. ఒక ఇల్లు వున్నవి. పెద్ద కొడుకుకు రాఘవునికి వివాహాలుచేశాడు. ఇద్దరుకొడుకులు, లలిత కూడా కాపురాలు చేసుకుంటున్నారు. పెద్ద కొడుకును తాను ఇంత కాలమూ భక్తితో సేవించిన ప్లీడరుగారి కుమారుడు జూనియర్ ప్లీడరు వద్దనే గుమాస్తాగా చేర్పించాడు. ఆయనకు మరొక కుమార్తె మాత్రం ఉన్నది. ఆ కుమార్తెకు వివాహం చేయాలి. రెండవ కుమారునికి ఒక ఆధారం కల్పించాలి.

నరసింహం గారు సంవత్సరాల తరబడి నడ్డి వంచి కష్టపడి పని చేసి, కోపిష్టి అయిన యజమాని తిట్లు కూడా సహించి, కానీ కానీ చొప్పున కూడబెట్టి ఈ స్థితికి వచ్చాడు. ఆయనకు డబ్బు విలువ బాగా తెలుసు. దుబారా చేయడం ఎంత పాపమో తెలుసు. అందుచేతనే అల్లుడు సోమేశం

తండ్రి ఇల్లు విడిచి కడుపు చేతబట్టుకుని తన ఇంటికి చేరుకున్నప్పుడు తాను కొలదిగా అయినా సహాయం చేయగలిగిన స్థితిలో ఉండికూడా ఆయన కలుగ చేసుకోనలేదు. అల్లునికి. కుమార్తెనయితే ఇచ్చాడు కాని అల్లునిమీద డబ్బు విషయములో నరసింహం గారికి నమ్మకమేమీ లేదు. ఇతగాడు (అంటే సోమేశం) స్వతంత్రంగా ఏమైనా ఉద్యోగం సంపాదించి నిర్వాకస్థుడయితే అప్పుడు ఏమైనా చేయవచ్చునని ఆయన అనుకున్నాడు. ఈలోగా అతని గురించి ఏమైనా డబ్బు ఖర్చు పెట్టితే అది బూడిదలో పోసిన పన్నీరు కావచ్చునని ఆయన అనుకున్నాడు.

కాని ఆ తరువాత తరువాత అల్లుడు వచ్చి కాపురం పెట్టేందుకు సహాయం అడిగితే కూడా స్వతహాగా డబ్బు విషయంలో వున్న చిక్కులమూలంగా ఒక పట్టాన అతనికి డబ్బు ఇవ్వడానికి సిద్ధపడలేక పోయాడు. చివరికి ఇవ్వకుండానే ఉండిపోయాడు. కుమార్తెను తన ఇంటి వద్ద ఉంచుకుని ఆమెకు పురుడు పోయడమే అల్లునికి తాను చేయగలిగిన సహాయమని నరసింహంగారు అనుకున్నారు.

ఇక ఇప్పుడో అల్లుడు నిజంగానే నిర్వాకస్థుడు అయినట్లుగా కనుపిస్తూన్నాడు. రాఘవరావుకు ఏదైనా ఉద్యోగం సంపాదించి పెట్టి ప్రవేశ పెట్టినట్లయితే అంతగా అవసరమైతే ముందు ఎప్పుడు అయినా అల్లునికి తాను కూడా రవంత సహాయం చేయవచ్చునని ఆ మామగారు అనుకున్నాడు. సోమేశం తన అల్లుడాయె. ఆపాటి సహాయం చేయమని అల్లుని అడగడంలో తప్పు ఏమీలేదనిపించింది నరసింహంగారికి.

అందుచేత రాఘవరావును మద్రాసుకు పంపించడానికి ఆయన నిశ్చయించుకున్నాడు. పైగా ఆయన వృద్ధు డయ్యాడు. ఇక స్వయంగా కొడుకుకు ఏదైనా ఉద్యోగం ఇప్పించడానికి ప్రయత్నించ గలిగిన దార్ఢ్యం లేదు. అల్లుడు ఇంకా కుర్ర వాడు. రాఘవరావును మద్రాసు పంపడమే శ్రేయస్కరమని ఆయనకు అన్ని విధాలా తోచినది.

సోమేశానికి మామగారి సంగతి చాల వరకు తెలుసు. తను కోరినప్పుడు కూడా ఆయన సహాయంచేయకపోవడంతో అతనికి మామగారి మీద కొంత కోపం వచ్చినది. ఆ తరు వాత చిక్కులలో వుండి కూడా అతను మామగారి సహాయం అర్థించకపోవడానికి అదే కారణం. అట్టిది మామ గారే ఇప్పుడు తన సహాయం అర్థించాడు.

అయితే మామగారి మీద వున్న కోపం-సోమేశానికి, మామగారికి సంబంధించినది. మరి ఎవరిమీదను లేదు. రాఘవ రావు మీద అసలేలేదు దానికి తోడు అతనికి రాఘవరావు మీద కొంతఅభిమానంకూడా ఉన్నది సోమేశానికి వివాహం అయినప్పటినుంచి రాఘవరావుతో ఎక్కువ అనుబంధం ఏర్పడినది. సోమేశం కూడా స్నేహితుల సహాయం వల్లనే ఉద్యోగం సంపాదించుకుని ఉన్నాడు. ఇప్పటికి వెంకటరావు వంటి మిత్రుల సహాయంతోనే జీవించగలుగుతున్నాడు. లేక పోతే అతని జీవితానికే ఒక వెలుగు లేకుండాపోను. తనలాగే రాఘవరావుకు కూడా సకాలంలో సహాయం జరిగినట్లయితే అతని జీవితమూ ఒక దారిలో పడుతుంది. అందుచేత రాఘవ రావును తన ఇంట్లో వుంచుకుని, అతనికి ఏమైనా వుద్యోగం

సంపాదించి పెట్టడానికి సోమేశం నిశ్చయించుకున్నాడు. మామగారి ఉత్తరానికి సమాధానంగా అలాగే వ్రాశాడు. అతని నిర్ణయం భార్యతో చెప్పాడు. ఆమె గూడా ఒప్పుకొన్నది. ఈ విధంగా సోమేశం జీవితంలో అనుకోని విధంగా ఒక మార్పు వచ్చినది.

మంచిరోజు చూచుకుని బయలుదేరిన రాఘవరావు సకాలంలోనే మద్రాసు చేరుకున్నాడు. అదే రెండు గదుల్లోనూ సోమేశం దంపతులతో కలసి వెనుక శేషగిరిరావు ఇంట్లో సోమేశం వున్నట్లుగా ఇప్పుడు రాఘవరావుకు ఉద్యోగం సంపాదించి పెట్టడంకోసం సోమేశం ప్రయత్నించ ప్రారంభించాడు.

౧౫

ఆరుమాసాల కాలం దొరలిపోయినది. రాఘవరావుకు ఉద్యోగం సంపాదించి పెట్టే విషయంలో ఆరుమాసాల క్రిందట సోమేశం ఎక్కడ వున్నాడో ఇప్పుడూ అక్కడే వున్నాడు. రాఘవరావుకు వుద్యోగం లభించలేదు.

* * *

ఉద్యోగం కోసం ప్రయత్నించడం డబ్బు ఖర్చుతో కూడుకొన్నపని తనవద్ద వున్నా లేకపోయినా ఎక్కడినుంచి అయినా డబ్బు తెచ్చి, బావమరిది ప్రయత్నానికి డబ్బు కొరతలేకుండా చేయడం సోమేశం విద్యుక్త ధర్మం. ఆరు నెలలు గడిచిపోయేసరికి రాఘవరావుకు ఉద్యోగం సంపా

దించి పెట్టకపోతే తన సంసారమే నిలబడదేమో అనిపించే స్థితికి వచ్చాడు సోమేశం. ఉద్యోగం దొరికేవరకు రాఘవరావు సోమేశంవద్ద ఉండడం ఖాయం. ఉద్యోగం లభించిం తరువాత ఒకటి రెండు నెలలలో అయినా రాఘవరావు వేరుగా కాపురం పెట్టుకోవచ్చు. తనకుకూడా కొంత సహాయంగా వుండవచ్చు. లేకపోతే అతను వదలడం సంభవం కాదు. అతన్ని వదలించుకొనడం సోమేశానికి సాధ్యమూ కాదు. సోమేశానికి అప్పు ఇచ్చే దాతలుకూడా ఎవరూ కనిపించడం లేదు. ఇంటి అద్దె సహితం బకాయి పడినది. వుండడానికికూడా లేకపోతే సోమేశం గతి కుక్కలకు నక్కలకు కాకుండా పోతుంది. లలిత చేతి గాజులు ఈలోగానే ఎప్పుడో మార్వాడీ దుకాణానికి తాకట్టుకు వెళ్ళిపోయినవి.

ఇంటి యజమాని మూడు నెలలవరకూ ఊరకున్నాడు. ఆ తరువాత అయితే ఇంటి అద్దె బకాయిలతో చెల్లించి ఇక ముందు ఏ నెల కా నెల చెల్లిస్తూ వుంటే వుండవచ్చు. లేకపోతే ఖాళీచేయవలసి వస్తుందని ఖచ్చితంగా చెప్పివేశాడు.

సోమేశం గతిలేక ఇంక ఎవరూ కనుపించక తన గోడు అంతా విశ్వనాథన్‌తో చెప్పుకున్నాడు. మూడు నెలల అద్దెకు, మరొక పక్షం రోజుల గ్రాసానికి సరిపోయేటంత అంటే దాదాపు ఎనభై రూపాయలవరకు అప్పు కావాలి. లేకపోతే ఇంట్లోంచి వెళ్ళిపోవలసివస్తుందని చెప్పాడు. అంత డబ్బు చేబదులుగా ఇచ్చేవారు ఎవరూ లేరని, వడ్డీమీద అప్పులు ఇచ్చే ఒక ఆసామీ తనకు తెలుసునని, కావాలంటే అతనివద్ద ఇప్పిస్తానని, ఈ ఉపకారం మాత్రం తను చేయగలనని

విశ్వనాథన్ అన్నాడు. నీటిలో మునిగిపోతున్న మనిషి గడ్డిపరకనుకూడా ఆశ్రయించినట్లుగానే సోమేశం వెంటనే ఆ ఉపకారం చేయించమని విశ్వనాథన్‌ను కోరాడు. అతను ఆ ఉపకారం చేశాడు. దానితో సోమేశానికి ఆ ఆపద గడిచింది. అయితే ఈ సంగతి లలితకు తెలియదు.

ఇది జరిగిన మూడు నెలలకు అదృష్టవశాత్తు రాఘవరావుకు ఒక ఉద్యోగం దొరికే అవకాశం గోచరించినది. మౌంట్‌రోడ్‌లో కమలా ఫర్నిచర్ వర్క్సు అని ఒక కంపెనీ ఉన్నది. ఆ కంపెనీకి ఒక గుమాస్తా అవసరం. జీతం అరవై రూపాయలు. అయితే నూరు రూపాయలు డిపాజిట్టు కావాలి. ఈ సంగతి సోమేశానికి ఆ ఇంట్లోనే వున్న ఒక పెద్ద మనిషివల్ల తెలిసినది. సోమేశం కొడుకు సుందరం ఆ పెద్దమనిషి ఇంట్లోనే చనువయ్యాడు. కొడుకుద్వారా ఆ వాటావారితో సోమేశానికి పరిచయం అయినది. ఆయన బంధువులలో ఒకరు ఫర్నిచర్ కంపెనీ నడుపుతున్నారు. ఆయన సోమేశం బావమరిదికి ఉద్యోగం యిప్పించడంకోసం పడుతున్న అవస్థ చూచి జాలిపడి, ఫర్నిచరు కంపెనీ యజమానితో చెప్పి ఆ ఉద్యోగం సంపాదించిపెట్టాడు. అయితే ఉద్యోగంలో వెంటనే ప్రవేశించాలి. డిపాజిట్టు కూడా వెంటనే చెల్లించాలి. లేకపోతే ఆ అవకాశం ఉండదు.

సంగతి తెలుసుకున్న తరువాత సోమేశం భార్యతో సంప్రదించాడు. స్త్రీలు స్వతహాగా తెలిసినవారు కాకపోయినా అనుభవంవల్ల చాలానే తెలుసుకుంటారు. తన

తమ్ముడు వచ్చి యిక్కడ వుండడం మూలంగాను, వాని ఉద్యోగప్రయత్నంకోసం అధికంగా ఖర్చు అవుతున్న కారణంచేతను మొత్తానికే ముప్పువచ్చినా తమ మనుగడకే కష్టం అవుతున్న సంగతి ఆమె గుర్తించినది. తమ్ముడు ఉద్యోగం సంపాదించుకుని, వేరే కాపురం పెట్టుకున్నట్లయితే తాము మళ్ళీ మామూలుగా బ్రతకవచ్చునని ఆమె ఊహించినది. ఇన్నాళ్ళూ తమ్ముని ఇంట్లో పెట్టుకుని ఉద్యోగంలేని సమయంలో పొమ్మనమనడానికి కూడా నోరు రాదు. ఉద్యోగం దొరికితే ఆ బాధ వుండదు. ఇప్పటికే ఈ డబ్బు చిక్కుల మూలంగా భర్త సగం చిక్కి శల్యావశిష్టమై వున్నాడు. భర్తకు యిప్పుడు రెండు పూటల భోజనం తప్పితే ఆఫీసుకు పట్టుకొని వెళ్ళడానికి ఇంత పెరుగు అన్నం కూడా ఇవ్వలేకపోతున్నది. ఈ డిపాజిట్ కట్టే విషయం తండ్రికి వ్రాసి, ఆయన వద్దనుంచి డబ్బు వచ్చేవరకు నిరీక్షించి ఉందామంటే ఈ అవకాశం కాస్తా చేయిజారి పోతుంది. పైగా తండ్రి సంగతి ఆమెకు తెలుసు. ఒక పట్టాన ఆయనదగ్గరినుంచి డబ్బు ఊడిపడదు. చెడిన వ్యవహారము ఎలాగూ చెడినది. ఇక మిగిలినది. అయినా చక్కబెట్టుకునేందుకు ప్రయత్నించాలని ఆమె అన్నది. అందుకోసం తన మెడలో రెండుపేటల గొలుసు విక్రయించి తమ్ముని ఉద్యోగంకోసం డిపాజిట్టు కట్టుదామని ఆమె అనుకున్నది. అది మూడు కాసులు వున్నది. దాదాపు రెండువందల పాతిక రూపాలవరకు రావచ్చు. దానితో ఈ అవసరం గడుస్తుంది.

పైగా అదే సందర్భంలో సోమేశం వెనుక తాను చేసిన అప్పు సంగతి కూడా ఆమెతో చెప్పాడు. అది తీర్చు కొనకపోతే బ్రతికే వుపాయం వుండదని అతను అన్నాడు. వడ్డీ పేరుచెప్పి నెలనెలా పదిరూపాయలు పోతున్నది. రూపాయికి రెండణాల చొప్పున వడ్డీ ఇస్తూవస్తే తాము బ్రతికేదెలాగు అని ఆమె అనుకున్నది. ముందు తన గొలుసు విక్రయిస్తే ఈ పరిస్థితినుంచి బయటపడవచ్చు. గొలుసు ఉండి తనను ఉద్ధరించేది ఎలాగూ లేదని ఆమె అనుకున్నది. ఒకవేళ తండ్రి కనుక ఆ డిపాజిట్టు బాపతు వంద రూపాయలు ఇస్తే, గాజులు విడిపించుకోవచ్చు. లేకపోతే అవి కూడా దక్కకపోవచ్చు. ఏమైనా గొలుసు విక్రయించి ఈ ఋణవిధంగా చేయడమే శ్రేయస్కరమని లలిత అనుకున్నది. అదేవిధంగా చేయమని భర్తతో చెప్పినది. సోమేశం కూడా దానికి అంగీకరించాడు.

రాఘవరావు మౌంట్‌రోడ్‌లోని కమలా ఫర్నిచర్ కంపెనీలో 'గుమాస్తా కమ్ సేల్సుమన్ కమ్ ఖజాంచీ' అయ్యాడు. రాఘవరావు సంతోషించాడు. అతను మితభాషి. ఇంతకాలమూ తననుగుంచి అక్క, బావగారు ఎంత కష్టపడుతున్నారంటే అతనిలో మానవత్వం లేదనికాదు, తనకు రాజమండ్రి ప్రాంతం దొరికే ఉద్యోగాలు ఏమీ లేవని అతను అనుభవంవల్ల తెలుసుకున్నాడు. అక్కడ వుంటే చివరికి జీవితం ఎందుకూ పనికిరాకుండాపోతుంది. ఎప్పటికైనా ఏమైనా ఉద్యోగమంటూ లభిస్తే మద్రాసులోనే లభించాలి కాని, మరొకచోట లభించదు. ఉద్యోగమంటూ లభించక

పోయినా పోనీ తండ్రి ఏమైనా డబ్బుపెట్టి తను ఏ వ్యాపారం అయినా చేసుకునేందుకు సహాయం చేస్తాడా అంటే ఆయన అట్టి అకార్యకరణం ఏమీ చేయడని అతనికి క్షుణ్ణంగా తెలుసు. ఆ మాటకు ఇప్పుడు ఈ డిపాజిట్టు అయినా సాహసించి అక్క, బావగారు కలసి కట్టారుకాని ఇదే తన తండ్రిమీద ఆధారపడివుంటే ఈ ఉద్యోగానికి నీళ్ళు వదలుకొనవలసినదే అని అతనికి తెలుసు. అందుచేత కష్టమో, నిష్ఠురమో యిక్కడేవుండి, ఏమైనా ఉద్యోగం సంపాదించుకుని స్వతంత్రంగా బ్రతికే ఏర్పాటు చేసుకుందామని రాఘవరావు అనుకున్నాడు.

అంతేకాదు. ఆ తరువాతకూడా అక్కగారి ఇంట్లోనే ఉండి, వారికి కొంత సహాయం చేద్దామనికూడా రాఘవ అనుకున్నాడు.

రాఘవరావు సహజంగానే తనకు ఉద్యోగం లభించిన సంగతి, డిపాజిట్టు సంగతి తండ్రికి తెలియపరిచాడు. నరసింహంగారు డబ్బు పంపలేదు సరిగదా ఎప్పుడు పంపేది తెలియపరచ నన్నా తెలియ పరచలేదు. రాఘవరావుకు ఉద్యోగం దొరికినది కనుకను, వివాహితులై భార్యలతో కాపురం చేస్తూన్న యువకులు చిరకాలం ఒంటరిగా ఉండడం మంచిదికాదు కనుకను, కోడల్ని (అంటే రాఘవరావు భార్య కామాక్షమ్మ)ను వెంటనే ప్రయాణంచేసి పంపుతున్నట్లు తెలియపరుస్తూ, ఫలానా తేదీని స్టేషన్‌కు రమ్మని కొడుకును ఆదేశించాడు నరసింహంగారు. ఆ తేదీకి సరిగ్గా కామాక్షమ్మ

భర్తతో కాపురం చేయడంకోసం మద్రాసు మహానగరానికి చక్కా వచ్చినది.

సోమేశం ఏమీ మాట్లాడలేదు. అతడు మౌనంగా ఉంటున్నాడు. లలిత సంగతి అంతా కనిపెట్టి చూస్తున్నది. ఆమె ఒక నెల రోజులవరకు వేచివున్నది. తమ్ముడు రాఘవ రావు ఒక నెలజీతం అందుకున్నాడు. కాని అతను ఇంతవరకు వేరే కాపురం పెట్టుకునే విషయమై ఏమీ అనలేదు. రెండు కుటుంబాలు ఆ రెండు గదుల్లోనూ వుండడం చాలా కష్టంగా ఉన్నది. అందుకని ఆమే ఒకనాడు కలుగజేసుకుని రాఘవ రావుతో అన్నది:—"ఒరేయ్ తమ్ముడూ! ఇంక ఎక్కడైనా ఒక వాటా అద్దెకు తీసుకుని, నీ పెళ్లాం, నువ్వు వేరే వుండండి- ఇక్కడ ఇంతమంది వుండటం కష్టం. ఇంక నువ్వు ఆలస్యం చేశావంటే నా మనస్సుకు కష్టం కలుగుతుంది. మీ బావగారు చెప్పలేదుకదా అని నువ్వు జాప్యం చేయనక్కర లేదు."

తన అక్కగారే స్వయంగా ఇలా తనతో చెప్పడంతో రాఘవరావుకు విశేషమైన కోపం వచ్చింది. ముక్తసరిగా "అలాగే లే" అని సమాధానం చెప్పి వెళ్ళిపోయాడు.

రాఘవరావుకు ఉద్యోగం ఇప్పించిన పెద్దమనిషే ఇప్పుడు మరొక సహాయం చేశాడు. ఆయన తన వాటా ఖాళీచేసి వెళ్ళిపోయాడు. లలిత తమ్ముని తరఫున తానే ఆ వాటా అద్దెకు తీసుకున్నది. తమ్మునిచేత ఒక నెల అద్దె అడ్వాన్సు ఇప్పించి, దగ్గర వుండి అతనిచేత ఆ వాటాలో

కాపురం పెట్టించినది. అక్కగారి పట్టుదల చూచి రాఘవరావు తనలోతాను మరీ మండిపడిపోయాడు. కాని వేరుగా ఉండటంమాత్రం తప్పలేదు. సోమేశం కేవలం ప్రేక్షకుడుగా ఉండిపోయాడు.

౯

ఆ నెల అంతా బావ, బావమరదుల కుటుంబాలు ఇరుగు పొరుగుననే నివసిస్తూ ఉన్నప్పటికీ పరాయివాళ్ళవలె మద్రాసులో సర్వసాధారణంగా కనపడే ఎన్నో కుటుంబాల వలె మసలుకొనసాగారు.

మరుసటి నెల మొదటితారీకున సోమేశానికి మామూలుగా జీతం వచ్చినది. అందరికీ ఇచ్చుకొనడం అయినది. ఆ వారం రేషన్ కొన్నాడు. మరొక వారం రేషన్ కొనడానికిమాత్రం చేతిలో డబ్బు ఉన్నది. ఆ వారం ఆఖరు అవుతున్నదనగా సోమేశానికి పెద్ద చిక్కువచ్చి పడినది. కొడుకు సుందరానికి జ్వరం వచ్చినది. విరేచనాలు కూడా ప్రారంభమైనవి. సోమేశం, లలిత కంగారు పడ్డారు. సోమేశం ఉపేక్ష చేయలేదు. లోగడ భార్య లలితకు ఒకసారి మందు యిచ్చిన వైద్యునివద్దకు వెళ్ళి ఆయనను ఒకసారి యింటికి తీసుకునివచ్చాడు. ఆయనవచ్చి పిల్లవాడిని పరీక్షించాడు. పిల్లవాడికి టైఫాయిడ్ వచ్చిందని చెప్పాడు. ఆ రెండు గదులు, పోసరాలుకూడా పరీక్షించి పిల్లవాడిని వెంటనే

హాస్పిటల్‌లో చేర్పించమని చెప్పాడు. లేకపోతే పిల్లవాడిని రక్షించడం సాధ్యం కాకపోవచ్చునని హెచ్చరించాడు. హాస్పిటల్‌లో చేర్పించేమాట అయితే తాను చీటీ వ్రాసి యిస్తానని, రాయపేట ఆస్పత్రిలో చేర్పించవచ్చుననీ అన్నాడు. సోమేశం డాక్టరు చెప్పినదానికి అంతటికీ ఊఁ కొట్టాడు. ఆ రాత్రికి రాత్రే వెంకటరావు ఇంటికి వెళ్ళి అతనిని కొంత డబ్బు యిమ్మని కోరాడు. వెంకటరావు మారుమాట్లాడకుండా అయిదు రూపాయలు యిచ్చాడు. సోమేశం డాక్టరువద్దకు వెళ్ళి ఆయనకు విజిటింగ్ ఫీజు, ఆరోజు మందుకు చెల్లించుకునేసరికి అతనివద్ద డబ్బు స్వల్పంగా మిగిలింది. డాక్టరు ఇచ్చిన చీటీతీసుకున్నాడు. మరునాడు ఉదయం సుందరాన్ని ఆసుపత్రిలో చేర్పిద్దా మనుకున్నాడు. కాని తనవద్దనున్న డబ్బు సరిపోదు. ఇంక తనకు డబ్బు ఇచ్చే వారు ఎవరూ లేరు. అప్పుడు అతనికి ఒక ఆలోచన తట్టింది. బావమరిది రాఘవరావుకు ప్రతినెల మొదటివారం ఆఖరులో జీతం ఇస్తారు. అతనికి ఈరోజో, క్రిందటినాడో జీతం వచ్చి ఉంటుంది. ఇప్పటిమటుకు పిల్లవాడిని ఆస్పత్రిలో చేర్పించడానికి తగినంత డబ్బు రాఘవరావును అడిగి తీసుకొనవచ్చుననుకుని సోమేశం ఆ రాత్రి నిర్భయంగానే నిద్రపోయాడు.

సుందరాన్ని ఆస్పత్రిలో చేర్పించమని డాక్టరు చెప్పగానే సోమేశం దానికి అంగీకరించడానికి ప్రబలమైన కారణం డబ్బే. ఒక్కసారి డాక్టరును తీసుకొనివచ్చి చూపించి ఒక్కరోజు మందు ఇప్పించడానికే అతను అయిదారు రూపాయల వరకు ఖర్చుపెట్టవలసివచ్చినది. చేతిలో ఇంక కానీ లేని

సమయంలో కొడుకు వైద్యంకోసం డబ్బు ఎక్కడినుంచి తీసుకొని రాగలిగేది అతనికి బోధపడడంలేదు. చివరికి ఎక్కడా డబ్బు సంపాదించలేని పరిస్థితికూడా ఏర్పడవచ్చు. ఆనాడు సుందరానికి వైద్యం ఎలా జరుగుతుంది? అందులోనూ టైఫాయిడ్ వచ్చిన కుర్రవాడికి సక్రమంగా వైద్యం జరగకపోతే ఎలా? మరొక విషయమేమంటే ఈ ఇంట్లో పిల్లవాడిని ఉంచటం ప్రమాదకరమని వైద్యుడు చెప్పాడు; ఆస్పత్రిలో చేర్పించడానికి చీటీకూడా ఇస్తానని ఆయన అన్నాడు. ఏది ఎటువచ్చినా ఆస్పత్రిలో అంటూ ఉంటే ముందు వైద్యము సక్రమంగా జరిగిపోతుంది. పరిసరాలు గురించికాని, మరే అవసరం ఉండదు. ఎటువచ్చీ భార్య అక్కడ ఉండటానికిమాత్రం కొంత ఖర్చు అవుతుంది. దానికి డబ్బు ఎక్కడైనా ఏదోవిధంగా సంపాదించడానికి కూడా సోమేశం నిశ్చయించుకున్నాడు.

మరుసటిరోజు ఆదివారం. ఉదయం ఎనిమిది గంటలకు సోమేశం రిక్షా ఒకటి తీసుకొనివచ్చాడు. లలిత సుందరాన్ని ఎత్తుకొని వీధిలోకి వెళ్ళింది. సోమేశం రాఘవరావు వాటా వద్దకు వెళ్ళాడు. సుందరానికి టైఫాయిడ్ వచ్చిన సంగతి బావమరిది రాఘవరావుకు, అతని భార్య కామాక్షమ్మకు తెలుసు. కామాక్షమ్మ రాత్రి చాల ప్రొద్దు పోయేవరకు వదినగారివద్ద, పిల్లవాడివద్ద కూర్చునే వెళ్ళింది. సుందరాన్ని ఈ ఉదయం ఆస్పత్రిలో చేరుస్తున్న సంగతి కూడా వారికి తెలుసు.

సోమేశం ఇంటిలోనికి వెడుతూ ఉంటే ఎక్కడికో వెళ్ళడానికి బయలుదేరిన రాఘవరావు ఎదురయ్యాడు.

"సుందరాన్ని ఆస్పత్రిలో చేర్పించడానికి తీసుకు వెడుతున్నాను. నావద్ద డబ్బు ఏమీలేదు. చాల చిక్కగా ఉన్నది. అయిదు రూపాయలు ఇయ్యి రాఘవా! మళ్ళీ ఎక్కడైనా చూచి ఇచ్చేస్తాను" అని బావమరిదిని చూస్తూనే అన్నాడు సోమేశం.

రాఘవరావు వెళ్ళుతున్నవాడల్లా ఆగిపోయి ఒక్క నిమిషంసేపు నిదానంగా సోమేశంవంక చూచి "నా దగ్గర డబ్బు ఏమీ లేదు, నిన్ననే అంతా అయిపోయింది" అని సమాధాన మిచ్చాడు.

సోమేశం నిర్ఘాతపోయాడు. అయినా తమాయించుకుని "ఆఖరికి ఒకటి రెండు రూపాయలు అయినా ఇవ్వలేవా!" అని దీనంగా అర్థించాడు.

"లేవు, ఉంటే అలాగే ఇచ్చి ఉండేవాడిని. ఇన్ని సార్లు అడగాలా?" అన్నాడు రాఘవరావు.

సోమేశం హతాశుడై వెనుకకు తిరిగాడు. రాఘవరావుకూడా అతన్నే అనుసరించి బయటికి వస్తున్నాడు. అంతలో కామాక్షమ్మ ఇంట్లోంచే- "ఏమండోయ్! ఆదారినే బొగ్గుల దుకాణానికి వెళ్ళి ఒక గుండు బొగ్గులు కూడా పట్టుకురండి" అని కేక వేసి భర్తను హెచ్చరించినది. భార్య కేకకు రాఘవరావు సమాధాన మీయలేదు.

ఈ మాటలు చెవిలో పడేసరికి సోమేశం తట్టుకోనలేకపోయాడు. అతనికి ప్రపంచంమీద, మానవజాతిమీద

తగని ద్వేషం పుట్టుకొనివచ్చింది. రాఘవరావు దగ్గర డబ్బు ఉంచుకునే ఖండితంగా లేదని చెప్పడము, అందులోనూ తను ఎంతటి ఆపత్సమయంలో ఉండి అడిగినదికూడా తెలిసి ఉండి, లేదనడము సోమేశం సహించలేకపోయాడు. అప్పుడు విచారిస్తూ కూర్చోవడంవల్ల ప్రయోజనంలేదు. అందుచేత సరాసరి ఇంటి యజమానివద్దకు వెళ్ళి ఆయనను బ్రతిమాలి రెండురూపాయలు తీసుకొని, కొడుకును రాయపేట ఆస్పత్రిలో చేర్పించి, భార్యను అక్కడే దిగవిడిచి ఇంటికి తిరిగి వచ్చాడు.

సోమేశం ఇంటికి తిరిగి వచ్చేసరికి కామాక్షమ్మ అతనికి కూడా వంటచేసిపెట్టింది. లలితకు ఆస్పత్రికి పట్టుకొని వెళ్ళడానికి పక్కవారిని ఎవరినో అడిగి తీసికొన్న చిన్న కారియర్‌లో ఇంత అన్నం వగైరా సర్ది సిద్ధంగా ఉంచినది. రాఘవరావుమీద ఉన్న కోపాన్ని అతని భార్యమీద చూపడంకాని, ఆమె తనంతట తాను చేసిన సహాయాన్ని నిరాకరించి ఆమెను అవమానం చేయడంకాని సోమేశానికి చేతకాలేదుకాని, ఆనాటినుంచి అతను రెండు పనులుమాత్రం చేయలేకపోయాడు. సోమేశం ముఖం చూచి అతనితో మాట్లాడడముకాని, రాఘవరావు ఇంట్లో భోజనం చేయడం కాని అతనికి చేతకాకపోయినది.

మరునాడుకూడా సోమేశం ఆస్పత్రికి వెళ్ళి, భార్యకు భోజనం అందజేసి, అక్కడినుంచి ఆఫీసుకు వెళ్లాడు. వెంకటరావే స్వయంగా సోమేశాన్ని అడిగి అతని పరిస్థితి అంతా తెలుసుకున్నాడు. వెంకటరావు ఒక సలహా ఇచ్చాడు.

"సోమేశం! నా పరిస్థితి కూడా ఇప్పుడు బాగులేదు. ఈ ఏడాది పంట పాడయిపోయినది. ఆ మధ్య చేసిన అప్పు తీర్చటం మాట దేవుడు ఎరుగు– ఈ ఏడాది పన్ను చెల్లించు కునేందుకు కూడా ఉపాయంలేదు. మళ్ళీ అప్పు ఇస్తేగాని గడిచే ఎత్తు కనిపించడం లేదు. ఇదంతా నీతో చెప్పడానికి కారణం ఉన్నది. నువ్వు చిక్కులలో పడ్డావు. నీకు ఏమైనా సహాయం చేయడానికి నాకు శక్తిలేదు. కనుక నామీద ఆశ పెట్టుకో వద్దని చెప్పడానికి నా పరిస్థితి అంతా వివరించి నీకు తెలియ జేశాను. అయినా నువ్వు నిరాశ చెందకు. ఏమైనా ఇలాంటి అవాంతరాలు వచ్చినప్పుడు మన ఆఫీసు వాళ్ళు జీతంమీద అప్పులు ఇవ్వడం నేను ఎరుగుదును. అందుచేత మేనేజరుకు ఒక దరఖాస్తు పెట్టుకో– నీ పిల్లవాడి వైద్యానికి, అప్పులు అవీ ఏమైనా ఉంటే వాటిని తీర్చుకుని వాటినుంచి విముక్తి చెంద డానికి సరిపడేటంత– బొత్తుగా పెద్ద మొత్తం కాకుండా— అడుగు. ఆ తరువాత దేవుడే ఉన్నాడు" అన్నాడు వెంకట రావు.

మనసులోనే వెంకటరావుకు ధన్యవాదాలు అర్పించు కొని సోమేశం నూటఏభై రూపాయలు జీతంమీద అప్పు ఇమ్మని కోరుతూ ఒక దరఖాస్తు వ్రాసి మేనేజరుకు అంద జేశాడు.

మేనేజరు దానిని మంజూరు చేయడము, ఆ రోజునే సోమేశం చేతికి డబ్బు రావడము జరిగినది. సోమేశం వెంకట రావు ఋణం కూడా కొంతమటుకు తీర్చుకున్నాడు.

మధ్యలో ఒకటి రెండు పర్యాయాలు ఆందోళన కలుగజేసినా సుందరం పరిస్థితి ఇరవై ఒకటవ రోజున పథ్యానికి వచ్చినది. మరి నాలుగు అయిదు రోజులలో ఇంటికి తీసుకొని వచ్చాడు. ఆ తరువాత కొన్నాళ్ళపాటు బలం రావడానికి మందులు యిప్పించాడు. సుందరం మళ్ళీ ఎప్పటివలె ఆరోగ్యంగా ఉంటున్నాడు. నలభై రూపాయల ఖర్చుతో సోమేశం బయటపడ్డాడు.

ఈలోగా సోమేశం మనసులో ఒక నిశ్చయం చేసుకున్నాడు. సాధ్యమైనంత త్వరలో ఇల్లు మారి, రాఘవరావుకు ఎంత దూరంగా ఉండగలిగితే అంత దూరంగానూ ఉండి, అతనితో ఎలాంటి సంబంధమూ లేకుండా ఉండాలని అతని సంకల్పం.

* * *

ఆ తరువాత కొలది రోజులకే నరసింహారావుగారు భార్యనూ, కుమార్తెను తీసుకొని ఆకస్మికంగా మద్రాసుకు చక్కావచ్చారు. కుమారుడు రాఘవరావు ఇంట్లోనే దిగారు. కొడుకు కాపురానికి కావలసిన సరుకులు, కొంత బియ్యం, పప్పుదినుసులు కూడా పట్టుకొనివచ్చి ఇచ్చారు. అత్తగారు, మరదలు వచ్చి సోమేశం ఇంట్లోకూడా రెండు రోజులు గడిపారు. కాని మద్రాసులో వున్న వారం పది రోజులలోను నరసింహారావుగారు మాటవరుసకు అయినా అల్లుడు ఉన్న సమయంలో ఎప్పుడూ అల్లుని గడపత్రొక్కిన పాపాన పోలేదు.

అర్థాంతరంగా కొడుకును, కోడలిని వేరే వుంచి వారి మానాన వారిని విడిచిపెట్టిన నేరానికి నరసింహంగారికి అల్లుని పైనా, కుమార్తెపైనా కూడా విశేషమైన ఆగ్రహం కలిగినది. దానికి ప్రాయశ్చిత్తంగా కొడుకు ఉద్యోగానికి డిపాజిట్టు కట్టడానికి కుమార్తె యిచ్చిన డబ్బు ఇవ్వడానికి ఆయన అంగీకరించలేదు. అసలు ఆయన ఎటూ ఆ డబ్బు యిచ్చి వుండేవాడు కాడు. ఇప్పుడు యిదికూడా దానికి తోడు అయినది.

కుమార్తె చేతులకు గాజులు, మెడలో గొలుసు లేకుండా వుండడం చూచి సోమేశం అత్తగారు అయిన మహాలక్ష్మమ్మగారికి కోపం వచ్చినది. మనుమడు బలహీనంగా ఉండడం చూచి అతని ఆరోగ్యం విషయంలో తగిన శ్రద్ధ వహించనందుకు ఆమెకు కుమార్తెపైనా, అల్లునిపైనా కూడా కోపం వచ్చింది.

రాక రాక వచ్చిన తల్లి తండ్రులకు, తనకు కట్టుకొనడానికి ఒక్కొక్క బట్ట అయినా పెట్టనందుకు ఇంకా వివాహంకాని ఆ బావగారిపై కోపం వచ్చినది.

మొత్తంమీద నరసింహంగారి కుటుంబం మద్రాసులో వున్నంతకాలమూ ముక్కు విరుపులు, మూతి విరుతోనే కాలక్షేపంచేసి, వారం పది రోజులలో అలాగే తిరిగి వెళ్ళిపోయారు.

ఇదంతా చూచి సోమేశం తన నిశ్చయం బలపరచుకున్నాడు. లలిత మనస్సుకు కూడా అలాగే వున్నది.

సోమేశానికి అట్టి అవకాశంకూడా త్వరలోనే లభించినది. అతను రెండు చేతులతోనూ ఆ అవకాశాన్ని జారిపోనీయకుండా పట్టుకుని దానిని వినియోగించుకున్నాడు.

సోమేశం ఎప్పుడయితే భార్య అంగీకారంతో తన నిశ్చయం బలపరుచుకున్నాడో అప్పుడే ఆ సంగతి వెంకటరావుకు తెలియపరచాడు.

అంతకుముందు వెంకటరావు తరచుగా సోమేశాన్ని తన ఇంటి సమీపానికి వచ్చి వుండమంటూ వుండేవాడు. ఇప్పుడు సోమేశం యిల్లు మారడానికి నిశ్చయించడంలో ఇరువురు కలసి ఒకచోట వుండవచ్చుననే భావం అతనికి కలిగినది. అతను హర్షించాడు. సోమేశంకోసం ఒక వాటా సంపాదించడానికి అందులోనూ తన యింటి సమీపంలో ఎక్కడ అయినా సంపాదించడానికి వెంకటరావు ప్రయత్నం ప్రారంభించాడు.

మరి కొలది రోజులకే వెంకటరావు వున్న ఇంట్లోనే ఒక వాటా ఖాళీ అయినది. అద్దె పదిహేను రూపాయలే.

పిల్లవాడి జబ్బు సమయంలో ఆఫీసులో అప్పుతీసుకున్న మొత్తంలో యింకా కొంత సోమేశంవద్ద మిగిలి వున్నది. దానిని సోమేశం వెంకటరావువద్దనే దాచుకున్నాడు. ఆ డబ్బుతో ఈ యింటవద్ద వున్న చిల్లర మల్లర అప్పులన్నీ తీర్చుకుని, ఒక శుభదినాన సోమేశం వెంకటరావు వున్న యింటిలోని వాటాకు మారిపోయాడు. అతని జీవితంలో మరొక అధ్యాయం ముగిసినది.

సోమేశం దూరంగా వున్నప్పుడు వెంకటరావు కుటుంబంవారికి, సోమేశం కుటుంబంవారికి మధ్య రాకపోకలు జరుగుతూవుండేవి. సోమేశం పడిన బాధలు గురించి తెలుసు కొని వుండడంవల్లను, సోమేశం మంచితనం గురించి వెంకట రావు తరచుగా చెబుతూ అతన్ని పొగుడుగుతూ వుండడం వల్లను వెంకటరావు కుటుంబంవారికి సోమేశం కుటుంబం మీద కొంత సానుభూతి, సద్భావము వున్నవి.

వెంకటరావు ఇంటిలో వాటా తీసుకుని అక్కడికి మారిన తరువాత ఈ రెండు కుటుంబాల మధ్య సానుభూతి, సద్భావాలు పెరిగినవి. పైపెచ్చు యిదివరకు ఎన్నడూలేని అన్యోన్యత ఏర్పడినది. ఈ రెండు కుటుంబాలవారు ఎట్టి అరమరికలు లేకుండ ఏక కుటుంబంలా ఉంటున్నారు. సోమేశం కొడుకు సుందరం వెంకటరావు ప్రేమాభిమానాలు చూరగొన్నట్లే వెంకట్రావు కుమార్తె సుందరంకన్న ఒక ఏడాది చిన్నది. శారద సోమేశానికి చేరువై ఇరవైనాలుగు గంటలూ అతన్ని విడిచిపెట్టకుండా వుండేది.

ఇక్కడే వెంకటరావు కుటుంబం గురించిన వివరాలు కూడా తెలుసుకొనడం అవసరం. ఆ కుటుంబంలో వెంకట రావు, అతని భార్య పద్మ, కుమారుడు పదేళ్ళవాడు గోపాలం, కుమార్తె శారద, వెంకటరావు తల్లి అనుమా యమ్మగారు వున్నారు. అనుమాయమ్మగారు వృద్ధురాలు. ఆమె ఏగొడవ పట్టించుకొనకుండా ఎప్పుడూ ఏదో ఒక మూల

కూర్చుని భగవద్ధ్యానం చేసుకుంటూ వుంటుంది. ఆ ఇంటికి పద్మే యజమానురాలు. ఇంటికి వెలుపల వెంకటరావు ఏవిధంగా స్వతంత్రుడో అదేవిధంగా ఆ యింటి సరిహద్దు లోపల పద్మకూడా సర్వ స్వతంత్రురాలు.

* * *

సోమేశం ఈ యింటికి మారి దాదాపు ఏడాది అయినది. ఈలోగా ఆ రెండు కుటుంబాల మధ్య సంబంధ బాంధవ్యాలలోనూ చాల మార్పులే వచ్చినవి.

ఇప్పుడు పద్మకు సోమేశం పేరు చెప్పినా ఆట్టే అంత గిట్టదు. దూరంగా ఉన్నంతకాలమూ సోమేశం కుటుంబానికి వచ్చిన కష్టాలపట్ల ఆమె సానుభూతి చూపినది. వారికి భర్త చేసిన సహాయాన్నికూడా ఆమె హర్షించినది. కాని, ఈ ఏడాది పొడవునా సోమేశం కుటుంబంతో కలసి ఒక ఇంట్లో ఉండడంమూలంగా ఆమె కొన్ని సంగతులు తెలుసుకున్నది. సోమేశం కుటుంబానికి ఏ కష్టంవచ్చినా, ఎన్ని కష్టాలు వచ్చినా అవి తమ నెత్తిమీదనే పడతాయని ఆమెకు తెలుసు. తాము లేకపోతే సోమేశం కుటుంబానికి సహాయం చేసేవారు ఎవరూ లేరని, తన భర్త తప్పితే ఇతరులు ఎవరితోనూ సోమేశానికి ఆపాటి అనుబంధం లేదని ఆమెకు తెలుసు. లోగడ తమ పరిస్థితి బాగా ఉన్నప్పుడు ఆమె భర్తే కాదు, పద్మ కూడా ఇతరులకు సహాయం చేస్తూనే ఉండేది. ఇప్పుడు పరిస్థితి తారుమారు అయినది. వరుసగా రెండేళ్ళు పంటలు పాడు అయిపోయినవి. ఈ రెండేళ్ళూ చేసిన అప్పులు

తీర్చుకొనడానికి రెండు ఎకరాల భూమి అయినకాడికి అమ్ము కొనవలసి వచ్చింది. అందుచేత ఇతరులకు సహాయం చేయడ మంటే పద్మకు అరికాలి మంట నెత్తికెక్కుతున్నది. అంను లోనూ సోమేశం కుటుంబానికి చేసేది సహాయం కాదు. వారి కుటుంబాన్ని కొంత వరకు భరించడమే–ఎవరికైనా సహాయం చేస్తే ఏమైనా అవసరం వచ్చినప్పుడు మళ్ళీ వారి వల్ల సహాయం పొందడానికి అవకాశం ఉంటుంది. కాని సోమేశం కుటుంబంవల్ల తమకు జరిగే సహాయం ఏమీ లేదనే ఆమె నిశ్చయించుకున్నది. ఏ విధంగానైనా ఈ పీడ వదల్చుకుంటే బాగుండునని ఆమె అనుకోసాగింది.

ఈ ఏడాదిలో వెంకటరావులో కూడా చాల మార్పు ఉన్నది. వెంకటరావు సహృదయుడే. పరోపకారబుద్ధి కల వాడే– ఇతరులకు సహాయం చేయగలిగిన శక్తి కలవాడే – కాని తాను చిక్కులలో పడనంతవరకు అతను ఒక రకంగా చాల ధీమాతో ఉండేవాడు. తనే చిక్కులలో పడిన తరువాత అత నికి ఆ ధీమా పోయినది. అప్పులు తీర్చుకునేందుకు ఉన్న కొంచెం భూమిలోను రెండు ఎకరాలు అమ్ముకునే సరికి అత నికి కొంత భయం పట్టుకున్నది. ఈ స్థితిలో భార్య మాటలు అతని మనసును చాల వరకు లొంగదీసుకున్నవి.

లోగడ ఎప్పుడూ బయట తాను ఏమిచేసినా భార్య జోక్యం చేసుకునేదికాదు. ఇప్పుడు ఈ భూమి అమ్ము కున్న తరువాత నుంచి ఆమె తన వ్యవహారాలు గురించి తెలుసుకొనడానికి విశేషమైన ఆసక్తి చూపుతున్నది. తనను శాసిస్తూన్నది. మొదటి నుంచి భార్య అంటే ఉన్న భయం

ఇప్పుడు ఇనుమడించినది. భూమి విక్రయించడానికి తానుచేసిన తప్పులే అంటే ఒళ్ళూపై తెలియకుండా ఇతరు లందరికీసహాయం చేయడమే కారణమైనట్లు, భార్య మాటలలో ధ్వనిస్తూ ఉండడం చూచి అతను హడలి పోయాడు. అప్పటినుంచి దేనికైనా ఖర్చుపెట్టడానికి అతను వెనుకంజ వేస్తూన్నాడు. భార్య ప్రశ్నించకుండా ఉండే పరిస్థితి ఏర్పడేటట్లు చేసుకొనడానికే అతను తాపత్రయపడుతున్నాడు. ఇతరుల క్షేమంపట్ల ఆసక్తి చూపి, వారి కష్టనష్టాలలో వారిని ఆదుకుని సహాయం చేయడానికి పూనుకునేవారందరు ఏనాడో ఒకనాడు చెల్లించి తీరవలసిన జరిమానాయే వెంకటరావు ఈనాడు చెల్లిస్తూన్నాడు.

కాని ఈ జరిమానా చెల్లించడం ఎంత కష్టమో వెంకటరావు అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు. స్వాతంత్ర్యం కోల్పోవడము, తనకంటె ఎక్కువ జాగ్రత్త కలిగిన భార్య, ముఖ్యంగా తను వేలు ఎత్తి చూపెట్టడానికి తగిన నేరాలు ఏమీ చేసివుండని భార్య శాసనాలు శిరసావహించడము కష్టమే అయినా తప్పనిసరివిగా పరిగణించవచ్చు. కాని ఇతరుల స్నేహంకూడా కోల్పోవలసిన పరిస్థితి రావడం అతనికి చాల బాధ కలిగించినది. ఎందువల్లనంటే వెంకటరావు ఇప్పుడు సోమేశంతో మునుపటివలె ఉండలేకపోతున్నాడు. సోమేశం ఏమైనా సహాయం కోరతాడేమో తను చేయలేక పోతానేమో అనే బాధతోపాటు చేస్తే ఏమవుతుందోనన్న భయంకూడా అతన్ని పట్టుకున్నది. సోమేశం కుటుంబంపట్ల భార్య వైఖరి ఎలా ఉన్నది వెంకటరావు గుర్తించాడు.

ఎటువచ్చీ మార్పు ఏమీ లేకుండా ఉన్నది ఒక్క—లే- సుందరంమీద వెంకట్రావుకు ఏర్పడిన ప్రేమకాని, ఆ ఇరు వురి మధ్య ఉన్న అనుబంధంకాని, అదేవిధంగా శారద, సోమేశంల మధ్య అనుబంధంకాని ఏమాత్రమూ మార్పుచెంద లేదు సరిగదా, నానాటికీ అభివృద్ధి చెందుతూ ఉన్నది. కాని అదే సోమేశం హృదయంలో ఆరని చిచ్చు రగుల్కొల్ప డానికి కారణమైనది.

* * *

దాదాపు నెలరోజులుగా శారద దగ్గుతో బాధపడు తున్నది. ఎవరూ అంతగా ఆ విషయం పట్టించుకోనలేదు. గచ్చాకు పుచ్చాకు నలిపి ఇచ్చి అదే తగ్గిపోతుందను కున్నారు. కాని అది తగ్గిపోలేదు. ఎక్కువ అయింది. చివరకి శారదకు జ్వరం వచ్చి మంచం ఎక్కి భరింపరాని ఆయా సంతో బాధపడుతున్నప్పుడు కాని ఎవరికీ వేడి పుట్టలేదు.

పద్మ కుమార్తెను తమ కుటుంబానికి ఎప్పటినుంచో వైద్యం చేస్తూన్న డాక్టరుకు చూపింది. ఆయన పరీక్షించి మందు ఇవ్వడం ప్రారంభించాడు. జ్వరం అయితే నాలుగు అయిదు రోజులకల్లా తగ్గిపోయింది. కాని దగ్గు మాత్రం తగ్గ లేదు. పిల్ల ఆ రోజు కా రోజు నీరసించిపోతున్నది. ఆ డాక్టరు ఎన్ని మందులు మార్చినా శారద పరిస్థితిలో రవంత మార్పు కూడా కనుపించడంలేదు.

సహజంగానే శారద గురించి సోమేశం బెంగపెట్టుకు న్నాడు. వెనుక సుందరానికి టైఫాయిడ్ వచ్చినప్పుడు వానిని పరీక్షించి ఆస్పత్రిలో చేర్పించిన వైద్యునిమీద అతనికెంత

గురి ఉన్నది. కొడుకు సురక్షితంగా ఇంటికి తిరిగి రావడమే దానికి కారణం కావచ్చు. అప్పటి నుంచి ఏ అవసరం వచ్చినా సోమేశం ఆ డాక్టరు వద్దకే వెళ్ళుతున్నాడు. పైగా ఆయన డబ్బును కూడా తొందర చేయడు. ఇన్నాళ్ళూ వైద్యం చేయించినా ప్రయోజనం లేకపోయినది. కనుక ఆ శారదను ఆ డాక్టరుకు చూపించడం మంచిదేమో అని సోమేశం అనుకున్నాడు. అనుకోనడమే తడవుగా ఆసంగతి వెంకటరావుతో చెప్పాడు.

శారదకు జబ్బు వచ్చినది లగాయితు పద్మ సోమేశం మీద బాహాటంగానే రుసరుస లాడటం ప్రారంభించినది. పిల్ల ఇరవైనాలుగు గంటలూ సోమేశం ఇంట్లోనే ఉండడంవల్ల ఆమె పరిస్థితి గుర్తించలేక పోయాము కాని. లేకపోతే అంతకాలం ఉపేక్ష చేసి ఉండేవాళ్ళం కాదని, పిల్ల ఏనాడో స్వస్థురాలై ఉండేదనీ ఆమె అంటున్నది. శారద పరిస్థితి సకాలంలో గుర్తించకపోవడానికి సోమేశం శారదను చేరదీయడమే కారణమని ఆమె నిందిస్తున్నది. అయినా సోమేశానికి శారదమీద ఉన్న ప్రేమ వెంకటరావుకు తెలుసు. ప్రస్తుతం చేయిస్తున్న వైద్యంవల్ల ప్రయోజనం లేదని కూడా తెలుసు. ఉపేక్ష చేయకుండా డాక్టరును మార్చి సోమేశం చెప్పినట్లుగా చేయడం మంచిదని అతను అనుకున్నాడు.

శారదను తీసుకొని వెళ్ళి సోమేశం డాక్టరుకు చూపించాడు. సోమేశం దగ్గర ఉండి శారదను ఆ డాక్టరు చేత పరీక్ష చేయించాడు. ఆయన వైద్యం ప్రారంభించాడు.

మరొక వారం రోజులకే శారద పరిస్థితి విషమించినది. శారదకు మళ్ళీ జ్వరం వచ్చినది. పూర్వంలా కాక ఇప్పుడు శారద దగ్గినప్పుడల్లా ఇంతింత రక్తం కూడా కక్కుతున్నది. ఈ పరిస్థితి చూచి వెంకటరావు దంపతులు గాభరా పడిపోయారు. పద్మ, సోమేశం మీద తగని కోపంతో ద్వేషంతో మండిపోసాగింది. వెంకటరావుకు కూడా సోమేశం మీద కోపం వచ్చినది. సోమేశం చూపించిన డాక్టరు ఏమీ చేతకానివాడు. లేకపోతే మొదటికే ముప్పు రావడం జరిగి ఉండేది కాదని అతను అనుకున్నాడు. అతను ఆ నిమిషం నుంచి సోమేశంతో మాట్లాడడం మానివేశాడు. శారద పరిస్థితి తెలుసుకుందామనే ఆదుర్దా కొలది సోమేశం ఇంటికి వస్తే పద్మ తలుపు భడేలుమని మూసివేసి అతన్ని లోనికి అడుగు పెట్టనీయడం లేదు. పిలిచినా వెంకటరావు పలకడంలేదు. ఇదివరకల్లా ఇష్టం లేకపోయినా శారదను సోమేశం ఇంటికి పోనీయకుండా అటకాయించని పద్మ ఇప్పుడు శారద ఆ వంక చూసి మామయ్యగారికోసం ఏడ్చినా పద్మ ఆమెను ఇల్లు కదలనివ్వడం లేదు. మళ్ళీ డాక్టరును మార్చి, వెంకటరావు కుటుంబంవారి డాక్టరు వద్దకే శారదను తీసుకొని వెళ్ళారు.

శారద తన కోసం ఏడుస్తూ ఉన్న సంగతి ప్రక్కవాటాలోనే ఉన్న సోమేశానికి వినపడుతూనే ఉన్నది. కాని, అతను ఏమీ చేయలేడు. ఈ పరిస్థితికి తట్టుకొనలేక కాఠిన్యం కర్కశత్వం ఆశ్రయించాడు సోమేశం. మరి ఆ తరువాత ఎన్నడూ ఆతడు శారద పరిస్థితి గురించి తెలుసుకొనడానికి ప్రయత్నించలేదు. మనసు రాయిచేసుకుని, హృదయం చంపు

కుని, ఆ విషయం ఏమాత్రమూ పట్టించుకోనకుండా కాల క్షేపం చేశాడు. కొడుకు సుందరం మామయ్యగారు (వెంకట రావు) వద్దకు వెళ్ళుతానని ఏడ్చినప్పుడు, అడగనైనా అడుగ కుండా వెంకటరావు ఇంటికి వెళ్ళిపోవడానికి బయలుదేరినప్పుడు మళ్ళీ ఎప్పుడూ అలాంటి పని చేయకుండా నిర్దాక్షిణ్యంగా గొడ్డును బాదినట్లు బాది వానిని అటకాయించాడు.

ఎన్ని చేసినా, ఏమి చేసినా శారద ఏడుపు అతనికి వినపడడం తప్పలేదు.

జబ్బుచేసి నాలుగు నెలలు అయ్యేసరికి శారద పరిస్థితి ప్రమాదకరంగా పరిణమించినది.

తల్లితండ్రుల హృదయం అంతకన్న ఎక్కువగా తనను ప్రేమించి చేరదీసి లాలించిన సోమేశం హృదయంలో ఆరని చిచ్చు రగుల్కొల్పి ఆ చిరుతబాలిక ఒకనాడు మృతి చెందినది.

అహో! అది ఎంతటి భయంకరమైన పీడ కల! ఎంతటి దారుణ వేదనా జ్వాలపుట్టించి, హృదయం జ్వలించి కమలిపోయేటట్లు చేసే దుర్దశ!

శారద మృతిచెందిన సమయంలో సోమేశం ఇంటి వద్దనే ఉన్నాడు. ఏడుపులు వినపడి సంగతి బోధపడేసరికి నిలువలేకపోయాడు. ఒక్కపరుగున పిచ్చివానిలా తన వాటా లోంచి ఆ వాటాలోనికి పరుగు ఎత్తాడు.

సోమేశం కనపడే కనపడగానే అంతటి దుఃఖంలో కూడా వెంకటరావు అతన్ని తిట్టిపోశాడు. పద్మ తన కుమా

రైను పొట్టబెట్టుకున్నాడని శపించింది. ఇక దానిని గురించి ఆలోచించడానికి కూడా సోమేశానికి శక్తిలేకుండా పోయింది.

౧౧

దీనికంతటికీ ఎవరు కర్తలు? ఎందుకు అదంతా ఇలా జరిగింది.

సాయంకాలం ఆఫీసు నుంచి తిరిగి వచ్చిన తరువాత వెంకటరావు అంటున్న మాటలు సోమేశం చెవిని పడినవి. తన కుమార్తెను పొట్టనబెట్టుకున్న ఈ ఇంటిలో, సోమేశం వంటి పాపిష్టులు ఉన్న ఈ ఇంటిలో ఇక నిలచిఉండడం వెంకటరావుకు ఎంత మాత్రమూ ఇష్టంలేదు. డాక్టరును మార్చమని సోమేశం సలహా ఇచ్చి ఉండకపోతే శారద జీవించి ఉండేది. ఆ మార్పువల్లనే ఆమె పరిస్థితి విషమించి చేయిదాటి పోయినదని తమ డాక్టరు అన్నట్లు వెంకటరావు అరుస్తున్నాడు. సోమేశం తనకు బాకీ ఉన్న మొత్తానికి నీళ్ళు వదులుకొని వెంకటరావు ఇక్కడి నుంచి వెళ్ళిపోతున్నాడు.

ఇకముందు ఏమిటని కాదు, దీనినంతటినీ ఎలా భరించాలి అనేదే సోమేశం మనస్సును పీడిస్తున్న సమస్య.

తెల తెలవారుతున్నదనగా ఆలోచనలతో అలసిపోయిన సోమేశానికి నిద్ర పట్టినది.

—౦—